RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 243 బుధవారం 02 - 04 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## హెచ్‌సియూ భూముల వెనుక

# దాస్తున్న నిజం ఏమిటి..?

- సీఎం రేవంత్ రెడ్డి నడుపుతున్నది ప్రభుత్వమా లేక బుల్డోజర్ కంపెనీనా
- పేద ప్రజల ఇండ్లనిను బుల్డోజర్లతో కూల గొట్టించారు
- కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్




సీఎం రేవంత్ రెడ్డి నడుపుతున్నది ప్రభుత్వమా లేక బుల్డోజర్ కంపెనీనా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. పేద ప్రజల ఇండ్లనిను బుల్డోజర్లతో కూల గొట్టించారని, అభివృద్ధి పేరు చెప్పి తొండలు కూడా గుడ్లు పెట్టని ఎండిన భూములు అంటూ గిరిజన గూడాలపై పడ్డారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా - వివరాలు 2 లో

# మయన్మార్‌లో ఆగని మృత్యుఘోష




- 2700 దాటిన మరణాలు..!
- మృతుల్లో 5 ఏళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారు
- కొన్ని ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకోవడం కూడా కష్టంగా ఉంది
- మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం

# బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న ఒంటిమిట్ట



- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు
- ఏప్రిల్ 5 నుంచి 15 వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు
- 11న సీతారాముల కళ్యాణం
- ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు
- అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక, పోలీసు, అన్నప్రసాదాలు పంపిణీకి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

ఒంటిమిట్టలోని కోదండరామ ఆలయంలో ఏప్రిల్ 5 నుంచి 15 వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 11న సీతారాముల కళ్యాణ మహోత్సం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ జీవీ అశోక్ కుమార్ పరిశీలించారు. ఉత్సవాల ఏర్పాట్లు, అభివృద్ధి పనులు, - వివరాలు 2 లో

# నక్సలిజం నిర్మూలనలో మరో మైలురాయి




- నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలపై కేంద్రహోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి 6 కు పరిమితం
- దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని
- నెలకొల్పాలన్న ప్రధాని నరేంద్ర మోడీ

# టీచర్ల నియామకాలు చేపడతాం సీఎం చంద్రబాబు

- ఉద్యోగులు ప్రజా సేవలో బాగా పని చేస్తున్నారు
- గతంలో బటన్ నొక్కామని చెప్పారు.. మీ బటన్లు అన్నీ నా పెన్షన్‌తో సమానం
- ప్రజలే ముందు.. ఆతర్వాతే మిగతా పనులు
- మళ్లీ అమరావతిని గాడిన పెట్టాం
- విశాఖకు రైల్వే జోన్ కూడా వచ్చింది



ఈనెలలోనే డీఎస్సీ పూర్తి చేసి జూన్‌లోగా టీచర్ల నియామకాలు చేపడతామని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. ఉద్యోగులు ప్రజా సేవలో బాగా పని చేస్తున్నారని అన్నారు. తాను ఏం సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నానని విమర్శించే వాళ్ళు కళ్లు తెరిచి చూడాలని అన్నారు.కొత్తగొల్లపాలెం టీడీపీకి కంచుకోట అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బాపట్ల జిల్లాలో పర్యటించిన సీఎం.. చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో పెన్షన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించిన ముఖ్యమంత్రి.. లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తగొల్లపాలెం ప్రజావేదిక సభలో చంద్రబాబు మాట్లాడుతూ... ప్రజలే ముందు.. ఆ తర్వాతే మిగతా పనులు అని స్పష్టం చేశారు. 'గతంలో బటన్ నొక్కామని చెప్పారు.. మీ బటన్లు అన్నీ నా పెన్షన్‌తో సమానం. ప్రజా సేవల పేరుతో పెన్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టా. ముందుండి నడిపించాలనే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా. పెన్షన్లు ఇచ్చేటప్పుడు గౌరవంగా - వివరాలు 2 లో

# వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలి




- చిన్నపాటి మనస్పర్థలకే అలుగుతారా
- యలమంచిలి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో మంత్రి లోకేశ్ సమావేశం
- గ్రామస్థాయి సమస్యలను తహశీల్దార్, వీఆర్‌వోలు పరిష్కరించాలి
- చిన్న కుటుంబంలోనే గొడవలు ఉంటాయని కానీ ఇంత పెద్ద పార్టీలో ఉండవా
- అనంతరం 4 వరుసల రహదారికి శంకుస్థాపన
- మంత్రి నారా లోకేశ్

## మొదటిపేజీ తరువాయి

# వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలి

మొదటిపేజీ తరువాయి

టీడీపీ కార్యకర్తలకు ప్రమాదబీమా మరింత పెంచుతున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. కార్యకర్తలు చిన్న చిన్న విషయాలకు కూడా అలుగుతున్నారని, చిన్నపాటి మనస్పర్థలు వస్తే అలగడం సరికాదని చెప్పారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో మంత్రి లోకేశ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు.తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అలకలకు వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలని మంత్రి లోకేశ్ సూచించారు. మొన్నటి ఎన్నికల్లో 58 శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చామని అలాంటి మనం మరింత ఉత్సాహంతో పని చేయాలని చెప్పుకొచ్చారు. చిన్న కుటుంబంలోనే గొడవలు ఉంటాయని కానీ ఇంత పెద్ద పార్టీలో ఉండవా అని అన్నారు. మీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఇన్‌ఛార్జి మంత్రులను కలవాలని సూచించారు.గ్రామంలోని చిన్న సమస్యలు కూడా తనకు తీసుకొచ్చి ఇస్తున్నారని మంత్రి లోకేశ్ వెల్లడించారు. గ్రామస్థాయి సమస్యలను తహశీల్దార్, వీఆర్‌వోలు పరిష్కరించాలని తెలిపారు. కార్యకర్తలు సొంతకాళ్లపై నిలబడాలని వారికి ఉపాధి కల్పించాలని చంద్రబాబు నిత్యం చెబుతుంటారని తెలిపారు. వైఎస్సార్సీపీ పాలనలో మనందరిని అడుగడుగునా అడ్డుకున్నారని గుర్తు చేశారు. అందరు నేతలు, కార్యకర్తలు కూటమి ధర్మం పాటించాల్సిందేనని ఆదేశించారు. అన్ని రంగాల్లో తెలుగువాళ్లు నెంబర్‌వన్‌గా ఉండాలనేదే మన కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేశ్ తెలిపారు.ఎవరూ అధైర్యపడవద్దు: యలమంచిలి నియోజకవర్గంలో 41,000 సభ్యత్వం నమోదు చేసినందుకు లోకేశ్ అభినందనలు తెలిపారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ, సోషల్ మీడియా, సభ్యత్వ నమోదులో మెరుగైన పనితీరు కనబర్చిన వారి వివరాలు అన్నీ తన దగ్గర ఉన్నాయని ఎవరు పని చేస్తున్నారో తెలుసుకునేందుకు ఈ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీలో కష్టపడిన కార్యకర్తలకే నామినేటెడ్ పదవులు ఇస్తామని, ఈ విషయంలో పార్టీ చాలా క్లారిటీతో ఉందని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అయిదేళ్లు ఉంటుందని తొలిసారి అవకాశం రాకపోయినా మూడు విడతల్లో కష్టపడి పనిచేసిన ప్రతి




కార్యకర్తకు న్యాయం చేస్తామని ఎవరూ అధైర్యపడవద్దని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు.గుంతల రోడ్ల నుంచి మోక్షం: కార్యకర్తలతో భేటీ అనంతరం అచ్యుతాపురం - అనకాపల్లి 4 వరుసల రహదారికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. అలాగే కూడలిలో ఫ్లైఓవర్‌తో పాటు 243 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సభాపతి అయ్యన్న, హోంమంత్రి అనిత, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అధికారంలోకి రాగానే గుంతల రోడ్ల నుంచి మోక్షం కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నామని లోకేశ్ తెలిపారు.

# బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న ఒంటిమిట్ట



మొదటిపేజీ తరువాయి

భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలు, చేపట్టాల్సిన పనులపై వారు చర్చించారు.అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక, పోలీసు, అన్నప్రసాదాలు పంపిణీకి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని జేఈవో వీరబ్రహ్మం అధికారులకు సూచనలు చేశారు. బ్రహ్మోత్సవాలకు, స్వామివారి కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. త్రాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, కల్యాణ తలంబ్రాల ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.భక్తుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, అత్యవసర పరిస్థితుల్లో గ్యాలరీల నుంచి బయటకు వచ్చేలా ఎమర్జెన్సీ పాయింట్స్?ని ఏర్పాటు చేయాలని అధికారులను కలెటక్టర్ ఆదేశించారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద పెండింగ్ పనులు, మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. బాకారాపేటలో ప్రవేశ నిష్క్రమణ మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ముందస్తుగా ఏర్పాటు చేయాలని శ్రీధర్ సూచించారు."కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నాం. ఆలయంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించాం. భక్తులకు త్రాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, కల్యాణ తలంబ్రాల ప్యాకెట్లను పంపిణీ చేయనున్నాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.బ్రహ్మోత్సవాల సందర్భంగా దాదాపు 2000ల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ జీవీ అశోక్?కుమార్ పేర్కొన్నారు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రణాళికలు చేపడుతున్నట్లు చెప్పారు. కల్యాణ వేదిక ప్రాంతానికి సంబంధించి కలెక్టర్? పలు సూచనలు చేశారని దానికి తగ్గట్లుగా పనులను చేపట్టనున్నట్లు వివరించారు.మరోవైపు వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వచ్చే ఏప్రిల్ 11 రాత్రి నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి 150 కిలోలు ముత్యాలను తెప్పించాలని టీటీడీ ఉన్నతాధికారులు ఇటీవలే ఉత్తర్వులు జారీ చేశారు. దాతల సహకారంతో కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. జానకీరాముల పరిణయ వేడుకలను తిలకించడానికి తరలి రానున్న భక్తులకు స్వామి వారి తలంబ్రాలను ఉచితంగా పంపిణీ చేయడానికి 1.50 లక్షల ప్యాకెట్లను సిద్ధం చేయనున్నారు.తలంబ్రాల తయారీకి బియ్యం 30 క్వింటాళ్లు, నెయ్యి 40 కిలోలు, కుంకుమ 20 బస్తాలు, పసుపు 20 మూటెలు (బస్తా 25 కిలోలు), కంకణాలు 1.50 లక్షలు అవసరమని అంచనా వేశారు. తలంబ్రాలు ప్యాకెట్లతోపాటు తిరుమల శ్రీవారి చిన్న లడ్డూలు (25 గ్రాములు) రెండు ప్రత్యేక సంచిలో పెట్టి కల్యాణ వేదిక ప్రాంగణంలోకి ప్రవేశించే సమయంలోనే ముందస్తుగా సందర్శకులకు అందజేసేలా ప్రణాళికను రూపొందించారు. ఇందుకోసం ప్రత్యేక పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

# జూన్‌లోగా టీచర్ల నియామకాలు చేపడతాం సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

ఇవ్వాలి. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఏపీ కంటే తక్కువ పెన్షన్' అని చెప్పుకొచ్చారు.మళ్లీ అమరావతిని గాడిన పెట్టామని తెలిపారు. అక్కడ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. విశాఖ స్టీల్ కూడా గాడిలో పడిందన్నారు. విశాఖ ఉక్కుకు రూ.11 వేల కోట్లు నిధులు తెచ్చామన్నారు. విశాఖకు రైల్వే జోన్ కూడా వచ్చిందన్నారు. ఈనెలలోనే డీఎస్సీ పూర్తి చేసి జూన్‌లోగా టీచర్ల నియామకాలు చేపడతామన్నారు. ఉద్యోగులు ప్రజా సేవలో బాగా పని చేస్తున్నారని అన్నారు. తాను ఏం సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నానని విమర్శించే వాళ్ళు కళ్లు తెరిచి చూడాలని అన్నారు. 2027కి పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానం చేస్తామని సీఎం స్పష్టం చేశారు.2029కి ఏపీలో జీరో పావర్టీ చూడాలనేది తన లక్ష్యమన్నారు. వారసత్వంగా అప్పు వచ్చిందని.. రూ.10 లక్షల కోట్లు అప్పు ఉందని వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి సమానంగా చేస్తానన్నారు. తల్లికి వందనం మేలో ఇస్తామని ప్రకటించారు. ఎందరు పిల్లలు ఉంటే.. అంతమందికి తల్లికి వందనం ఇస్తామన్నారు. నాలుగు నెలలకు ఒకసారి ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఇస్తామని చెప్పారు. మే, జూన్‌లో వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఇస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామని చెప్పారు. వ్యవసాయంలో మోడరైజేషన్ తీసుకువస్తామన్నారు. రాష్ట్ర ప్రజల కోసం డబ్బు సంపాదిస్తానని చెప్పారు.అంబేద్కర్ షెడ్యూల్ కులంలో పుట్టిన 12వ సంతానమని.. లండన్‌లో అంబేద్కర్ చదువుకోడానికి బరోడా సాయం చేశారన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం రాసే స్థాయికి ఎదిగారన్నారు. అబ్దుల్ కలామ్‌కు అయ్యర్ అనే వ్యక్తి ఆపన్న హస్తం అందించారని చెప్పుకొచ్చారు. కలాం చరిత్రలో నిలిచిపోయారన్నారు.



డ్వాక్రా సంఘాలకు పొదుపు నేర్పించారని.. ఇప్పుడు వారి వద్ద రూ.35 వేల కోట్లు పొదుపు డబ్బులు ఉన్నాయని తెలిపారు. సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిందన్నారు. గతంలో తాను సెల్‌ఫోన్ గురించి చెబితే అందరూ నవ్వారన్నారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇస్తామన్నారు. ఐదేళ్లలో ఇళ్లులేని అందరికీ ఇళ్లు కట్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# హెచ్‌సియూ భూముల వెనుక దాస్తున్న నిజం ఏమిటి..?

మొదటిపేజీ తరువాయి

మంగళవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మీడియాతో మాట్లాడారు.. మొదట పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పి%ౌ% పేద ప్రజల ఇండ్లను బుల్డోజర్లతో కూల గొట్టించారని, అభివృద్ధి పేరు చెప్పి తొండలు కూడా గుడ్లు పెట్టని ఎండిన భూములు అంటూ గిరిజన గూడాలపై పడ్డారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నడుపుతున్నది ప్రభుత్వమా లేక బుల్డోజర్ కంపెనీనా అని వ్యాఖ్యానించారు.ఇంకా "నువ్వు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధివా లేక రియల్ ఎస్టేట్ ఏజెంట్‌వా.. విధ్వంసం ఒక్కటే నీ ఎజెండా ఖజానాకు కాసులు నింపుకోవడమే నీ లక్ష్యం సెలవు దినాల్లో, అర్ధరాత్రి నీ బుల్డోజర్లు ఎందుకు నడుస్తున్నాయి ముఖ్యమంత్రి... కోర్టులు అంటే ఎందుకు నీకు అంత భయం హెచ్‌సీయూ భూముల వెనుక దాస్తున్న నిజం ఏమిటి". కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

**హెచ్‌సీయూ పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు..**

కాగా "రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రభుత్వ ఆస్తులు అమ్ముకుంటే భవిష్యత్ తరాలకు స్మశానాలకు కూడా జాగలు ఉండవన్నావు కదా.. మరిప్పుడు ప్రభుత్వ భూములు అమ్ముతూ.. నువ్వు చేస్తున్నదేంటి రేవంత్‌రెడ్డీ" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న భూ పరిరక్షణ పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పలువురు హెచ్‌సీయూ సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి అక్కడి పరిస్థితులను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూముల పరిరక్షణకు యూనివర్సిటీ విద్యార్థులు చూపుతున్న తెగువకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. హెచ్‌సీయూలో ఇద్దరు విద్యార్థులను అరెస్టుచేసి జైలుకు పంపినట్లు చెబుతున్నారని, వారి ఆచూకీని ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గతంలో



హెచ్‌సీయూకు రెండు సార్లు వచ్చి వెళ్లిన రాహుల్‌గాంధీ.. ఇప్పుడు తాజా అంశంపైనా స్పందించాలని కోరారు. బీజేపీతోపాటు ఇతర రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ మాజీ విద్యార్థులైన భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు... ఈ విషయమై ఎందుకు మాట్లాడడం లేదు.. విద్యార్థుల తరపున నిలబడేందుకు వారి మనసు రావడం లేదా.. అని నిలదీశారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీల్లో 45,000 ఎకరాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. 400 ఎకరాలపై ఎందుకింత దారుణంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వందలాది బుల్డోజర్లతో అక్కడున్న చెట్లు, జంతువులను చంపి.. మరీ వేగంగా కబ్జా చేసే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. హెచ్‌సీయూ చుట్టూ ఉన్న పచ్చదనాన్ని కాపాడుకోగలిగితే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని.. లేదంటే ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

# మయన్మార్‌లో ఆగని మృత్యుఘోష



మృతుల సంఖ్య అంతకంతకే పెరుగుతోంది. శుక్రవారం భూకంపం సంభవించిన ప్రాంతంలో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. శిథిలాలను తొలగించినా కొద్ది మృతదేహాలు బయటపడుతున్నాయి.ఇప్పటివరకు 2,719 మంది మృతదేహాలను వెలికితీశారు. స్థానిక మీడియా తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. మృతుల్లో 5 ఏళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారని తెలిపింది. మరో 4,521 మంది గాయపడ్డారని, ఇంకో 441 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉందని పేర్కొంది.ఇప్పటికే సైనిక పాలన, అంతర్యుద్ధాలతో మగ్గిపోతున్న మయన్మార్‌పై గత శుక్రవానం సంభవించిన భూకంపం తీవ్ర ప్రభావాన్ని చూపించింది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమైంది. కొన్ని ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకోవడం కూడా కష్టంగా ఉంది. దాంతో శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటికి తీసుకురావడం ఆలస్యమవుతోంది. మాండలే వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం వెలువడుతోంది. మండుటెండలో ఉత్త చేతులతో, చిన్నచిన్న పారలతో శిథిలాలను తొలగిస్తూ ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమో తెలుసుకునేందుకు స్థానిక ప్రజలు ప్రయత్నిస్తున్నారు.మాండలే ప్రాంతంలోనే ఓ ప్రీస్కూల్ కూలిపోవడంతో 50 మంది చిన్నారులు, ఇద్దరు టీచర్లు చనిపోయారని ఐరాస సిబ్బంది వెల్లడించారు. వివిధ దేశాల నుంచి వస్తోన్న సహాయక బృందాలు భూకంప ప్రాంతాలకు వెళ్లేందుకు ఆయా చోట్ల ప్రభుత్వ, తిరుగుబాటు దళాల మధ్య జరుగుతోన్న ఘర్షణలు అవరోధంగా మారాయి. ఈ పరిణామాల మధ్య మృతుల సంఖ్య ఎంతకు చేరుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, నీరు, షెల్టర్ తక్షణమే అందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని సహాయక చర్యల్లో పాల్గొంటున్న బృందాలు పిలుపునిస్తున్నాయి.

# నక్సలిజం నిర్మూలనలో మరో మైలురాయి




నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలపై కేంద్రహోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు పరిమితమైనట్లు వెల్లడించారు.దీంతో, నక్సలిజాన్ని నిర్మూలించాలనే కార్యక్రమంలో మరో మైలురాయిని చేరుకున్నామన్నారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించుకున్నారని.. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. వచ్చే ఏడాది మార్చినాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతమొందిస్తామని నొక్కి చెప్పారు. ఇకపోతే, హోంమంత్రిత్వ శాఖ రూపొందించిన నివేదికల ప్రకారం.. దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 ఉన్నాయి. నివేదికల ప్రకారం.. 2015లో ఇవి 35 ఉండగా.. 2018 నాటికి 30కి తగ్గాయి. 2021 నాటికి 25కు వచ్చాయి. భద్రతా దళాలు చురుగ్గా చేపడుతున్న వరుస దాడుల వల్ల ఇవి 6కు చేరాయి.

మహిళా మావోయిస్టు హతం

మరోవైపు, బస్తర్ ప్రాంతంలో సోమవారం మరో ఎన్ కౌంటర్ జరిగింది. భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు మృతి చెందింది. కాగా.. ఈ ఏడాది ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో 135 మంది మావోయిస్టులు భద్రతా సిబ్బంది కాల్పుల్లో చనిపోయారు. ఇందులో 119 మంది ఒక్క బస్తర్ డివిజన్‌లోనే మరణించినట్లు అధికారులు తెలిపారు. గత శనివారం సుక్మా, బీజాపుర్‌లో జరిగిన రెండు ఘటనల్లో 18 మంది మావోయిస్టులు మృతి చెందారు. మరో వైపు సోమవారం 50మంది మావోయిస్టులు తాము లొంగిపోతున్నట్లు ప్రకటించారు.

# ఏడేళ్ల బాలిక హత్య కేసు

మరణశిక్ష విధించిన న్యాయస్థానం

**అనకాపల్లి జిల్లాలోని బాలిక హత్య కేసులో నిందితుడికి మరణశిక్ష**

**నేరం రుజువు కావడంతో మరణశిక్ష విధించిన న్యాయమూర్తి**



బాలికను కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితునికి న్యాయస్థానం మరణశిక్షను విధించింది. దాదాపు పదేళ్లు సాగిన ఈ కేసులో నేరం రుజువుకావడంతో ధర్మాసనం ఈ రోజు తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళ్తే అనకాపల్లి జిల్లాలోని చీమకుర్తి గ్రామానికి చెందిన శుభాచారి గుణ శేఖర్ (31) అనే వ్యక్తి దేవరాపల్లి గ్రామంలో బంధువులు ఇంటి వద్ద ఉంటున్నాడు. అదే గ్రామంలో వేపాడ మురుగున్, ధనలక్ష్మి దంపతుల టీ కొట్టులో పని చేసేవాడు. మురుగున్, ధనలక్ష్మిలకు ఏడేళ్ల పాప ఉంది. అయితే గుణశేఖర్ ఆ పాపను 2015లో రైవాడ జలాశయం వద్దకు తీసుకెళ్లి బీరు బాటిల్?తో కిరాతకంగా హతమార్చాడు. ఈ ఘటనకు కారణం కుటంబ కలహాలేనని పోలీసులు తెలిపారు.మొదట తమ పాప కనిపించడం లేదని తల్లి ధనలక్ష్మి దేవరాపల్లి పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చేపట్టగా మరుసటి ఆ రోజు రైవాడ దరి బిల్లల మెట్ట వద్ద బాలిక మృతదేహం లభించింది. దీంతో నిందితుడైన గుణశేఖర్?పై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన తరువాత నేరం రుజువు కావడంతో దాదాపు పదేళ్ల తరువాత చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి కె. రత్నకుమార్ నిందితుడు గుణశేఖర్?కు మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అయితే చోడవరం కోర్టు చరిత్రలో మరణ శిక్ష విధిసూ తీర్పు చెప్పడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

**ఏడేళ్ల బాలిక హత్య కేసు - మరణశిక్ష విధించిన న్యాయస్థానం**

గుణశేఖర్ అనే వ్యక్తి పాపను 2015లో రైవాడ జలాశయం వద్దకు తీసుకెళ్లి బీరు బాటిల్?తో గొంతుకోసి హత్య చేశాడు. ఈ కేసుపై పూర్తిగా విచారించిన న్యాయస్తానం, అన్ని సాక్ష్యాలను పరిశీలించిన తరూవాత నేరం రుజువు కావడంతో ఆ దోషికి మరణ శిక్షను విధిస్తూ తీర్పు ఇచ్చింది. చోడవరం కోర్ట్ చరిత్రలో మరణ శిక్ష విధిసూ తీర్పు చెప్పడం ఇదే మొదటి సారి -

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

బుధవారం 02 - 04 - 2025

# ప్రగతిని అడ్డుకునే లా రాజకీయాలు చేయడం మంచిది కాదు

**హెచ్ సి యు కు చెందిన ఒక ఇంచ్ భూమిని కూడా కబ్జా చేయలేదు**

**బిఆర్ఎస్, బిజెపి లు తమ స్వార్థ రాజకీయాల కోసం కావాలని అందరిని తప్పుదోవ పట్టిస్తున్నారు**

**మీడియా సమావేశంలో**

**ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తో పాటు మంత్రులు కొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,శ్రీధర్ బాబు**

**హైదరాబాద్ ,తెలంగాణ సేన న్యూస్, ఏప్రిల్ 1 :** రాష్ట్ర ప్రగతిని అడ్డుకునే రాజకీయాలు చేయడం మంచిది కాదు అని ప్రతిపక్ష పార్టీలపై రాష్ట్ర మంత్రులు విరుచుకుపడ్డారు.మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి నిర్వహించిన ప్రెస్ మీట్ లో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,కంచె గచ్చిబౌలి లోని సర్వే నంబర్ 25 లోని 400 ఎకరాల భూమి ముమ్మాటికి ప్రభుత్వ ఆస్తి అని నొక్కి చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ తమ స్వార్థ రాజకీయాల కోసం కావాలనే అందర్నీ తప్పుదోవ పట్టిస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వారికి తగదు అని హితవు పలికారు.. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా రాజకీయాలు చేయడం మంచిది కాదు అని మానుకోవాలని సూచించారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కి చెందిన ఒక్క ఇంచు భూమిని కూడా ప్రభుత్వం కబ్జా చేయలేదు అని స్పష్టం చేశారు.ఇప్పటీ వరకు ఒక్క ఎకరం భూమిపై కూడా యూనివర్సిటీకి చట్టబద్ధ హక్కులు లేవు అని వెల్లడించారు. ఈ సమస్యను పరిష్కరించాలని యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు పట్టించుకోలేదు అని ఇప్పుడేమో పని గట్టుకొని మాపై దుష్ప్రచారం చేస్తూ విషం చిమ్ముతున్నారు అని ఆరోపించారు.వారం రోజుల కిందట యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ తో మేం ప్రత్యేకంగా సమావేశమయ్యాము అని వారి విజ్ఞప్తి మేరకు మా ప్రభుత్వం యూనివర్సిటీకి భూములపై నిబంధనల ప్రకారం చట్టబద్ధ హక్కులు కల్పించేందుకు చొరవ తీసుకున్నాము వివరించారు.అక్కడున్న నేచురల్ రాక్ ఫార్మేషన్స్, సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి వనరులను కనుమరుగు చేస్తున్నామంటూ కొందరూ మాపై దుష్ప్రచారం చేస్తున్నారు అని ,ఇది అసత్యం. ప్రకృతిని పరిరక్షించేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర ప్రజలందరూ వాస్తవాలను గమనించాలని, కోరారు .2003లో అప్పటి ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని మేం అధికారంలోకి వచ్చాకా సరిదిద్దాం అని చట్టబద్ధంగానే ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.తప్పుడు ప్రచారంతో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, పర్యావరణ ప్రేమికులు ఆందోళన కు గురి కావొద్దని సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# అత్యాచార బాధితురాలికి ప్రభుత్వం అండ

**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**ఊర్కొండ, తెలంగాణ సేన న్యూస్, ఏప్రిల్ 1 :** ఊరుకొండ పేట అత్యాచార ఘటనలో బాధితురాలికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఈ సంఘటన లో నిందితులు ఎవరైనాప్పటికీ వారిని కఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ఊర్కొండ పేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఒక వివాహిత మహిళపై సామూహిక అత్యాచార సంఘటన జరిగిన నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక ఆలయ అధికారులు పోలీస్ అధికారులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊర్కొండ పేట ప్రాంతం నుంచి మొదటిసారి జెడ్పిటిసి సభ్యుడిగా గెలిచారని ఆ తరువాత ఆయన ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి ఊర్కొండ పేట ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు జరిపించారని తెలిపారు. తాను కూడా ఎమ్మెల్యే ఎన్నికలలో తన బీఫామ్ ను ఆంజనేయస్వామి పాదాల వద్ద పెట్టి పూజించిన తర్వాతనే నామినేషన్ దాఖలు చేశానని చెప్పారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయ సమీపంలో జరిగిన ఈ సంఘటనను సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా పరిగణిస్తున్నారని, ఈ విషయం గా తనతో సీఎం ఫోన్లో మాట్లాడారని అనిరుద్ రెడ్డి వివరించారు. జరిగిన సంఘటనలో 8 మంది నిందితులు ఉన్నారని చెప్తుండగా వారిలో ఆరు మంది బిఆర్ఎస్, ఇద్దరు బిజెపి పార్టీలకు చెందిన వారు ఉన్నారని తన దృష్టికి వచ్చిందన్నారు.అయితే ఏ పార్టీ నాయకులైన ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడమని చెప్పరని అందుకే నిందితులు ఏ పార్టీ చెందిన వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలని అన్ని పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారని, ఇప్పుడు రాజకీయాలు ముఖ్యం కాదని బాధితురాలికి న్యాయం చేయడ%శీ%,అండగా ఉండడమే ప్రధానమని పేర్కొన్నారు.కొంతమంది ఈ అత్యాచార సంఘటన ఆంజనేయ స్వామి ఆలయానికి సమీపంలోనే జరిగిందని దుష్ప్రచారం చేస్తున్నారని వాస్తవానికి ఈ సంఘటన జరిగిన ప్రాంతానికి ఆలయం చాలా దూరంగా ఉందని సంఘటన జరిగిన ప్రదేశం కూడా ఆలయానికి చెందిన భూమి కాదని అనిరుద్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే ఊర్కొండ పేట ఆంజనేయస్వామి ఆలయానికి రాష్ట్రవ్యాప్తంగా భక్తులు వస్తుంటారని ఆలయం వెనుక వైపున పెద్ద గుట్టలు అటవీ ప్రాంతం ఉన్న కారణంగా ఆలయ పరిసరాలలో రక్షణ చర్యలు మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో లైటింగ్ వసతులను మెరుగుపర్చడంతో పాటు ఆలయ ప్రాంతానికి చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. ఈ ఆలయానికి భక్తులు ఎక్కువగా వచ్చే శనివారం రోజున మాత్రమే పోలీస్ పికేటింగ్ ఉంటుందని అయితే ఇలా కాకుండా ప్రతిరోజు కూడా ఒక పోలీస్ ఆలయం వద్ద రక్షణ గా ఉండే విధంగా తాను పోలీస్ అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. జరిగిన సంఘటనపై నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ తో మాట్లాడానని పోలీసులు ఈ సంఘటనకు సంబంధించిన నిందితుల విషయంలో స్వేచ్ఛగా చర్యలు తీసుకోవాలని వారికి మద్దతుగా ఎవరి నుంచి ఎలాంటి వత్తిళ్లు రాకుండా తాను చూసుకుంటానని హామీ ఇచ్చానని తెలిపారు. ఈ సందర్భంగానే విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన బదులిస్తూ సామూహిక అత్యాచార సంఘటనకు సంబంధించిన పలు వివరాలు తనకు తెలిసినప్పటికీ బాధితురాలి సంక్షేమం దృశ్య మానవత దృక్పథంతో ఆ వివరాలను వెల్లడించలేకపోతున్నానని స్పష్టం చేశారు. ఇటువంటి సంఘటనలు గతంలో కూడా జరిగాయని అయితే వాటిపై ఫిర్యాదు చేయడానికి కూడా బాధితులు ముందుకు రాలేదని తనతో కొందరు స్థానికులు చెప్పారని ఈ విషయాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారని అనిరుద్ రెడ్డి వెల్లడించారు.ముఖ్యంగా గంజాయి, మాదక ద్రవ్యాలు లాంటి మత్తు పదార్థాల కారణంగా యువత పెడద్రోవ పడుతుందని ఊర్కొండ పేట సంఘటనలో నిందితులు కూడా పాతికేళ్ల లోపు వయసు ఉన్నవారేనని చెప్పారు. తమ ప్రభుత్వం గంజాయి, మాదకద్రవ్యాల లాంటి వాటిని ఉక్కుపాదంతో అణచివేయడానికి కృతనిశ్చయంలో ఉందన్నారు. వీటి గురించి తెలిసిన ప్రజలు ప్రభుత్వానికి సమాచారం ఇస్తేనే చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని, తెలిసినా కూడా చెప్పకపోతే వాటిని కట్టడి చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. జరిగిన సంఘటన లో అధికారుల ప్రమేయం ఉందని తేలితే వారు కూడా జైలుకు పోవడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ సంఘటన లో కిలక పాత్ర పోషించినట్లు చెప్పబడుతున్న ఆలయ తాత్కాలిక ఉద్యోగిని ఇప్పటికే ఉద్యోగం నుండి తొలగించడం జరిగిందన్నారు. ప్రస్తుత ఆలయ ఈవో వచ్చిన తర్వాతనే అవినీతి తగ్గిందని ఆలయానికి నూతనంగా నియమించిన పాలకమండలి బాధ్యతలు చేపట్టిన తర్వాతనే ఆలయ పరిసరాలలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అనిరుధ్ రెడ్డి వివరించారు. బాధితురాలికి న్యాయం చేస్తానని ఆమె కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు.

# ఫీజు ఉపకార వేతనాల బకాయిల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం

**నేటి నుంచి జరిగే డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షల బహిష్కరణ**

**ఎం జి యూనివర్సిటీ ఫైనాన్స్ సెక్రటరీ దరిపల్లి ప్రవీణ్ కుమార్**




**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ ,ఏప్రిల్ 1 :** ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ , పెండింగ్ బకాయిలను చెల్లించకుండా జాప్యం చేస్తుందని , తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ ,పీజీ కళాశాలల మేనేజ్మెంట్, ఎంజియూ చాప్టర్ ఫైనాన్స్ సెక్రటరీ శ్రీ సాయి కృపా డిగ్రీ పీజీ కళాశాల విద్యా సంస్థల చైర్మన్ ,దరిపెల్లి ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలలో ఈ నెల 2 నుంచి జరిగే డిగ్రీ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షల ను బహిష్కరిస్తున్నట్లు ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. సందర్భంగా బుధవారం నుంచి జరిగే డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షల బహిష్కరణ కు పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి కృప డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎదుట మంగళవారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. సందర్భంగా మాట్లాడుతూ గత యేడాది అక్టోబర్ నుంచి దశలవారీగా తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల మేనేజ్మెంట్ ఫీజు రియంబర్స్మెంట్ విషయమై ఆందోళన చేస్తున్నప్పటికీ , గత నెల 16 న ఎంజీయు వీసీ కి, 23 న నల్లగొండ ఆర్డీఓ కు వేర్వేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. లేనిపక్షంలో త్వరలో జరగబోయే ప్రాక్టికల్ థియరీ పరీక్షలను బహిష్కరిస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరం లేక ఏప్రిల్ 2 నుంచి జరిగే డిగ్రీ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించడం లేదు అని తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు గత నాలుగు సంవత్సరాలుగా అప్పుల ఊబిలో కూరుకపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ నిర్ణయానికి యాజమాన్యాలు సిద్ధమైనట్లు వెల్లడించారు. విద్యార్థుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచితంగా నాలుగేళ్లుగా విద్య అందిస్తున్నట్లు తెలిపారు.దీంతో అధ్యాపకుల జీతాలు, భవనాల రెట్లు, కరెంట్ బిల్లులు, మున్సిపల్ ట్యాక్స్‌లు, యూనివర్సిటీ వివిధ ఫీజులను అప్పులు చేసి చెల్లించినట్లు తెలిపారు. ఇప్పటికే లక్షల రూపాయల అప్పులు అయ్యాయని, ఇక అప్పుచేసి జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేక పోవడంతోనే తప్పని పరిస్థితుల్లో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు.

**ఆరు నెలలుగా వేతనాలు లేవు**

జిల్లా మరియు ఎంజీయూ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు గత ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎంజీయూ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.ప్రశాంతి, మాజీ ఓఎస్డీ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డిని కలిసి అధ్యాపకులు తమ గోడు వెలిబుచ్చారు. వేతనాలు ఇవ్వడం లేదు కాబట్టి ఏప్రిల్ 2 నుంచి జరిగే డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు తెలంగాణ లెక్చరర్ ఫోరం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కొడిమల కృష్ణయ్య మరియు యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ లెక్చరర్ ఫోరం అధ్యక్షుడు యాకుబ్ బాబా తెలిపారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి పేద విద్యార్థులను, అధ్యాపకులను ఆదుకోవాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో పలు డిగ్రీ అండ్ పీజీ కళాశాలల అధ్యాపకులు ఉన్నారు.నేటి నుంచి జరిగే డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షల బహిష్కరణ అని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఉమ్మడిగా నిర్ణయం తీసుకొని తెలియజేశారు.

# పేద కుటుంబాలకు పోషకాహార భద్రత అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదురి శంకర్ రెడ్డి**



**శాలిగౌరారం, తెలంగాణ సేన :** తెలంగాణ రాష్ట్రంలోని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం మేరకు 80 శాతం మంది ప్రజలకు ఆహార భద్రత కోసం దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఉగాది పండగ సందర్భంగా రేషన్ కార్డు లబ్ధిదారులదరికి తెలంగాణ రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ చేసిన విషయం తెలిసిందేదని శాలిగౌరారం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఉప్పలంచ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో విప్లవాత్మక నిర్ణయం చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం,ప్రజా ప్రభుత్వంకి ప్రతి ఒక్కరు కృతజ్ఞతతో ఉండాలని అన్నారు.గడిచిన ఎన్నికల ప్రచారంలో భాగంగా సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చామని,ఈ ఉగాది పండుగ రోజున సూర్యాపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. రాష్ట్రంలోని పేద,దిగువ మధ్య తరగతి వర్గాల కోసం చారిత్రక నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రంలో ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా సన్నం బియ్యం ఇస్తుందన్నారు. రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ రేషన్ కార్డు షాపులలో మరిన్ని నిత్యవసర సరుకులు కాంగ్రెసు ప్రభుత్వం అందిస్తుందన్నారు.పేద ప్రజలందరు కడుపునిండా తినాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళు తుందన్నారు. పేద కుటుంబాలకు పోషకాహార భద్రత అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.గత ప్రభుత్వంలోని దొడ్డు బియ్యం పంపిణీలో చాలా అవకతవలు జరిగాయని,కావున దళారుల పాలు కాకుండా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు.అధిక నాణ్యత కలిగిన సన్న బియ్యం పంపిణీ ద్వారా ప్రజలకు మెరుగైన ఆహార పదార్థాలను అందించేందుకు చర్యలను ప్రభుత్వం తీసుకుంటుదన్నారు.ఎవరూ అధైర్యపడవద్దని అర్హులందరికి రేషన్ కార్డులు వస్తాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడ అరుణ్, ఉప్పలంచ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాచకొండ రాజు,సాలయ్య, పోగుల రాంబాబు, కత్తుల పరమేష్, బొంగు కృష్ణమూర్తి, భూపతి మల్లేష్ ,కత్తుల జంపయ్య, భూపతి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ సి యు భూమిని వేలం వెయ్యవద్దు

**ముందస్తు అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం**

**నేడు జిల్లా వ్యాప్తంగా నిరసనలు ధర్నా కార్యక్రమాలు**

**సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్**



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, ఏప్రిల్ 1 :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వెయ్య వద్దని, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ హెచ్చరించారు. ప్రభుత్వం తీరు పై నిరసన వ్యక్తం చేస్తూ, ఉద్యమిస్తున్న విద్యార్థులను, విద్యార్థి సంఘ నాయకులను, అక్రమంగా ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ధర్నా ,నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘాలుయూనివర్సిటీ కి చెందిన నాలుగు వందల ఎకరాల భూమిని ,అమ్మేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకిస్తూ ,విద్యార్థి సంఘం నాయకులు చేస్తున్న పోరాటానికి సిపిఎం రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం, ప్రజాసంఘాల నాయకులను అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఈరోజు యూనివర్సిటీ ముందు నిర్వహించే ధర్నా కు జిల్లా నుంచి వెళ్లకుండా భువనగిరి పట్టణ పోలీసులు అరెస్టు చేయడాన్ని, తమ పార్టీ ప్రభుత్వ తీరు పట్ల ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేసి అమ్మాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని దీని వ్యతిరేకిస్తూ నిన్న రాత్రి ఆందోళనలకు దిగిన యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై లాఠీ చార్జ్ చేసి విద్యార్థినీలను సైతం స్టేషన్ లో నిర్బంధించారని, సభ్య సమాజం తలదించుకునేలా కాంగ్రెస్ ప్రజా పాలన ఉన్నదని విమర్శించారు. ప్రజల మీద, ప్రజా సమస్యల మీద చిత్తశుద్ధి ఉంటే హెచ్ సి యు లో ఉన్న భూములను అమ్ముకునే విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# హెచ్ సి యు వద్ద పి ఎస్ యు నాయకుల అరెస్టు



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** హెచ్ సీ యు భూముల ఆక్రమణ నిలిపివేయాలని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని నష్టం చేకూర్చే విధానాలను మానుకోవాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. ప్రొగ్రెస్సివ్ స్టూడెంట్స్ యూనియన్ (పి ఎస్ యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ చలో హెచ్ సి యు కి పిలుపునిచ్చింది. ప్రధాన గేట్ లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలిసులు అక్రమంగా అరెస్టు చేసి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పి.ఎస్.యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా కార్పొరేట్ అనుకూల విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ సర్కారు విద్యార్థుల పట్ల నిరంకుశత్వం వీడి విద్యార్థులతో చర్చించాలని డిమాండ్ చేశారు.అరెస్టైన వారిలో పి.ఎస్.యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు, ఉస్మానియా యూనివర్సిటీ పి.ఎస్.యూ నాయకులు ప్రశాంత్ పగిళ్ళ, శ్రీధర్ యాదవ్,సృజన్,గోవర్ధన్ లు ఉన్నారు.

# పేదల ఆకలి తీర్చడానికి సన్న బియ్యం పంపిణీ

**ఎమ్మెల్యే మందుల సామేలు**



**శాలిగౌరారం,తెలంగాణ సేన :** పేదల ఆకలి తీర్చడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించింది అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలోని మంగళవారం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యంతో బియ్యం వ్యాపారులు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, నేడు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో అక్రమ బియ్యం దందాను అరికట్టవచ్చున్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి. యాదగిరి, డిప్యూటీ తహసిల్దార్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బోడ అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మద్ది మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదగోని అంజయ్య, ఎర్ర సైదులు, రవీందర్ రెడ్డి, బొంగు కృష్ణమూర్తి,శ్రీధర్, మజ్జు,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అత్తెల్లి లక్ష్మయ్య పద్మ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

**అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద పులిహోర పంపిణీ**



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం ఆర్యవైశ్య సీనియర్ నాయకుడు గజ్వేల్ మాజీ వైస్ ఎంపీపీ అత్తెల్లి లక్ష్మయ్య పద్మ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని ప్రతి మంగళవారం నాడు పులిహోర పంపిణీ కార్యక్రమం హనుమాన్ భక్త బృందం నోముల మహేందర్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్విరామంగా కొనసాగడం అభినందనీయమని ఈరోజు అత్తెల్లి లక్ష్మయ్య పద్మ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పులిహోర పంపిణీ కార్యమానికి సహరించిన ప్రతి ఒక్కరికీ దేవ దేవుళ్ళ అనుగ్రహం ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో సిద్ది బిక్షపతి, అత్తెల్లి శ్రీనివాస్, జగ్గయ్యగారి శేఖర్, అయిత సత్యనారాయణ,గంగిశెట్టి వెంకటేశం, ఉత్తునూరి సంపత్, కొమరవెల్లి ప్రవీణ్,సిరిపురం సత్యనారాయణ, కైలాస ప్రశాంత్,బాలేష్, వెంకటేష్,,ఉమేష్, లక్ష్మణ్, విష్ణు,ఆర్యవైశ్య నాయకులు, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు, అత్తెల్లి లక్ష్మయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన బైరం రమేష్

**అనంతరావు పల్లి లో అట్టహాసంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం**



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,గజ్వేల్ మండలం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ బైరం రమేష్, సీనియర్ నాయకుడు దామనమైన మల్లేశం కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ దాసరి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు దార మల్లేశం, మంకిడి ప్రభాకర్, తుమ్మ స్వామి, గోపాల్, కొప్పు రవి, బైరం కరుణాకర్,దాసరి రాజు,బైరం రాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పథకం పేదింటి గృహాల్లో సంతోషం



**జడ్చర్ల, తెలంగాణ సేన న్యూస్ :** రాయపల్లిలో రేషన్ షాపులో సన్న బియ్యం పంపిన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా నేడు రాజాపూర్ మండలంలోని రాయపల్లి గ్రామంలో గౌరవ జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# చేబర్తి లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

**ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ కే సాధ్యం తాండ కనకయ్య గౌడ్**

**సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**




**తెలంగాణ సేన :** ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ కే సాధ్యమని మర్కుక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాండ కనకయ్య గౌడ్ అన్నారు.సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చెబర్తి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ర్యాకం యాదగిరి అధ్యక్షతన, కాంగ్రెస్ నేతలు తిరుమల రెడ్డి,రఘుపతి,ఓంకార్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు, ముందుగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన అనంతరం తాండ కనకయ్య గౌడ్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీలు దశలవారీగా నెరవేరుస్తున్నారని అందులో భాగంగా సన్న బియ్యం పంపిణీ ప్రారంభించడం జరిగిందని ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ కే సాధ్యమని రేవంత్ రెడ్డి సర్కార్ కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ సంజీవ్, కాంగ్రెస్ నాయకులు బబ్బూరి అనిల్,యాదగిరి, బాల నరసయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గుండంపల్లిలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ

ప్రభుత్వంకు కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపిన ప్రజలు



**కొత్తగూడ తెలంగాణ సేన :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రం గుండం పల్లి లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి పేదవారి కుటుంబానికి సన్నబియ్యం ఇవ్వాలన్న దృక్పథంతో ఎంతో ప్రతిష్టాత్మక చేపట్టిన కార్యక్రమం ఉగాది రంజాన్ పర్వదినం నాడు మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , పంచాయతీరాజ్ శాఖ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ అనసూయ సీతక్క. గౌరవ అసెంబ్లీ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు కాంగ్రెస్ మంత్రివర్గం ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం కార్యక్రమం ను ప్రారంభించారు.రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క వారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య నేతృత్వంలో నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పంపిణీ కార్యక్రమంలో భాగంగా గుండం పల్లిలో అర్హులైన వారందరికీ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఆనాడు పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలి అనే సంకల్పంతో ఆహార భద్రత కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వం ఈనాడు ప్రతి ఒక్కరికి కడుపునిండా ఆరోగ్యకరంగా సన్న బియ్యం ఆహారం అందాలనే దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసినందుకు గుండంపల్లి గ్రామస్తులు కాంగ్రెస్ ప్రభుత్వంకు కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, లక్కాకుల రాజు, వద్ది సోమయ్య , గట్టి రమేష్ డీలర్ గట్టి పాపక్క మాజీ సర్పంచ్ నరసయ్య బాబు టి శ్రీను జి శ్రీను తోట మాధవులు మైద వెంకన్న ఆకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిన కార్యక్రమాన్ని ప్రారంభించిన

పీసీసీ సభ్యులు పెండెం రామానంద్



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈరోజు నర్సంపేట పట్టణానికి చెందిన 21వ వార్డులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ కార్యక్రమంలో ఓబీసీ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఓర్సు తిరుపతి, నర్సంపేట మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు గాజుల రమేష్, కొయ్యాడి సంపత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# బుక్లెట్ తో నకిలీ కల్తీ పదార్థాలు వస్తువులను కొని మోసపోవద్దు



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** వరంగల్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కమిటీల ఆధ్వర్యంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారి బుక్లెట్ తో నకిలీ కల్తీ పదార్థాలు,వస్తువులను కొని నష్టపోవద్దని మోసపోవద్దని ప్రచారం చేస్తూ వరంగల్ జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు భారత దేశంలో ఉన్నటువంటి ఐ ఎస్ ఐ, హాల్ మార్క్, ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ, ఆగ్ మార్క్, మొదలైన ప్రభుత్వ ట్రేడ్ మార్కులు ఉన్న ఆహార పదార్థాలు మరియు వస్తువులను మాత్రమే కొనడం గాని అమ్మడం గాని చేయాలని ట్రైడ్ మార్కులు లేకుండా అమ్మడం కొనడం చేయరాదని అట్లా ట్రైడ్ మార్కులు లేని నకిలీ వస్తువులు ఎక్కడ కనిపించినా సంబంధిత అధికారులకు టోల్ ఫ్రీ నెంబర్లు మరియు వాట్సాప్ నెంబర్లు 8800001915బీ1800114000 బీ1800425003333బీ 1915బీ డ్రగ్స్ కు 18005996969బీఆబ్కారీ కు 18004252523బీ మరియు ఆహార పదార్థాలు కల్తీ కి9868686868బీ1800112100 మొదలయిన నెంబర్ల ద్వారా ఫిర్యాదులు చేసి చర్యలు తీసుకునేటట్లు చేయాలని అన్ని ప్రభుత్వ శాఖ అధికారులను వినియోగదారుల మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరినారు.నర్సంపేట పట్టణంలోనూ ఆర్డిఓ, జిల్లా నీటిపారుదల శాఖ , ఐ సి డి ఎస్ , ఫైర్ స్టేషన్ మార్కెట్ సెక్రటరీ, తాసిల్దార్, పశుసంవర్ధక శాఖ అధికారి, సివిల్ సప్లై స్టాక్ పాయింట్లు, వ్యవసాయ శాఖ అధికారి, ఆప్కారి శాఖ అధికారి, ఆర్టీసీ డిఎం, ఎఫ్ ఆర్ ఓ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, చెన్నారావు పోలీస్ ఎస్సై,నర్సంపేట మున్సిపల్ కమిషనర్, మరియు వరంగల్ జిల్లా పౌర సరఫరాల అధికారి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్, ఎక్సైజ్ సూపర్ ఇండెంట్, ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్టర్ అధికారి మొదలైన అధికారులను వారి వారి కార్యాలయాల్లో వినియోగదారుల డీసీఐసీలు గిరగాని సుదర్శన్ గౌడ్ కే శ్రీనివాసరావు బెజ్జెంకి ప్రభాకర్ , నా గిల్లి సారంగం,వెంకటాచారి, రాము మరియు హనుమకొండ జిల్లా డిసిఐసి ఠాకూర్ రతన్ సింగ్ మొదలైన వారు కలిసి ట్రేడ్ మార్కుల ప్రాధాన్యతను వివరించి బి ఐ ఎస్ వారి బుక్లెట్ ను అధికారులందరికీ అంద చేసినారు.

## ఆశ్రమాలకు సేవ చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం

దత్తి సత్యనారాయణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



**మేడిపల్లి, తెలంగాణ సేన న్యూస్ ఏప్రిల్ 1:** దత్తి సత్యనారాయణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యవారంలో బోడుప్పల్ లోని శ్రద్ధ అనాథ ఆశ్రమం, కరుణ సాధన్ అభగ్యుల ఆశ్రమం లో తోటకూర రవీందర్ యాదవ్ చేతుల మీదిగా నిత్య వసరసర్కులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు చేయడం మా అదృష్టంగా భావిస్తున్నామని, మా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇలానే సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ఎవరైనా ముందుకు వచ్చి ఇలాగే సేవ భవంతో ఇలాంటివారిని ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దత్తి శ్రీసుధ, స్వర్ణ, చంద్రారెడ్డి, రవీందర్ చారి, మోహిత్ ప్రవీణ్, సత్యనారాయణ తదితరులు పాలుగోన్నారు.

## ఉద్యమంలో పాల్గొని వార్తలు రాసిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలి

ప్రింటు, ఎలక్ట్రానిక్,డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

నకిరేకల్ లొ తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



**నకిరేకల్, తెలంగాణ సేన :** తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13వ తేదీ న సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన జర్నలిస్టుల సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మోహన్ బైరాగి, డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే రాజేంద్ర ప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు వేముల యాదగిరి, టి యు జేఏసీ నాయకులు రమేష్ తెలిపారు. నకిరేకల్ లో మంగళవారం తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం పోస్టర్ను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల పరిస్థితి నేడు ఆగమ్యగోచరంగా మారిందని,తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు వార్తలు రాసి ఉద్యమాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులతో పాటు, ఉద్యమ వార్తలు రాసిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫోటో, వీడియో, డెస్క్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం కార్యక్రమం కు ఫోటో, వీడియో,ప్రింట్, ఎలక్ట్రానిక్, మీడియా జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని విజయం చేయాలని. ఈ కార్యక్రమంలో అసంఘటిత కార్మిక సంఘం నాయకులు బాబన్న, తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కొమ్ము శంకర్,ఎద్దు వెంకన్న, ఎద్దు రవి, తదితరులు పాల్గొన్నారు.

# అర్ధాంతరంగా ఆగిపోయిన బ్రిడ్జి పనులను పూర్తి చేయాలి

రుద్రవెల్లి - జూలూరు మధ్యన మూసి పై

బీబీనగర్ లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, గూడూరులో అండర్ పాస్ నిర్మించాలి

ఆర్మూడ్ ప్రభుత్వ మహిళ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను తిరిగి జిల్లాకు రప్పించాలి

27 డిమాండ్ ల తో వినతి పత్రం ఎమ్మెల్యేకు కుంభం కు అందజేశారు.

సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ ,ఏప్రిల్ 1 :** రుద్రవెల్లి - జూలూరు గ్రామాల మధ్యన మూసి పై అర్ధాంతరంగా ఆగిపోయిన బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని ,సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు.మంగళవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. జాతీయ రహదారిపై, బీబీనగర్ లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, గూడూరులో అండర్ పాస్ నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కు బీబీనగర్ మండలంలో పెండింగ్ లో ఉన్న సమస్యలు, తక్షణ సమస్యలు పరిష్కరించాలని 27 డిమాండ్ ల తో కూడిన వినతి పత్రాన్ని సిపిఎం నాయకత్వం సమర్పించారు.చంద్రారెడ్డి తో పాటు పట్టణ కార్యదర్శి ఓవల్దాస్ సతీష్ ఆధ్వర్యంలో అందజేశారు. చంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, రెట్టింపు పెన్షన్, ప్రతినెలా ప్రతి మహిళకు రూ 2500 లు, ఇంటర్ పైబడిన విద్యార్థినిలకు స్కూటీలు, రైతు భరోసా, రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని . బీబీనగర్ లో ఆస్తి పన్ను చెల్లించిన ఇండ్ల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని, విజిపి వెంచర్ లో గ్రామపంచాయతీ ఆస్తి నాలుగు ఎకరాల భూమిని విక్రయించిన వారిపై అందుకు సహకరించిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీబీనగర్ లెప్రసీ కాలనీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మధ్యన ఉన్నటువంటి డంపింగ్ యార్డ్ ను జనావాసాలకు దూరంగా తరలించాలని అన్నారు. బీబీనగర్ చెరువులోకి డ్రైనేజీ వాటర్ ను వదలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బీబీనగర్ ను కరువు మండలంగా ప్రకటించి పంట నష్టపరిహారాన్ని చెల్లించాలన్నారు. రాయరావుపేట సర్వే నెంబర్ 178 ప్రభుత్వ భూమిలో ఆ గ్రామానికి చెందిన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసి ఇవ్వాలన్నారు. జమీలాపేట బంధం వద్ద మంచినీటి బోరు చుట్టూత నిల్వ ఉన్న డ్రైనేజీ వాటర్ ను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. రాయరావుపేట సర్వే నెంబర్ 30, 31లో గతంలో గొర్ల కాపర్లకు ఇచ్చిన 24 ఎకరాల భూమిలో మట్టి తవ్వకాలను ఆపాలని, అర్ధరాత్రి దొంగ చాటుగా మట్టిని తరలించుకుపోతున్న మట్టి మాఫియా పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాఘవాపురం నుండి ఎర్రబెట్టె తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వెంకిర్యాల నుండి రాఘవాపురం వెళ్లే రోడ్డులో మూసి కాలువ పై ఉన్న కల్వర్టును మరమ్మతులు చేయాలని అన్నారు. జిల్లాకే తలమానికంగా ఉన్న ఎయిమ్స్ హాస్పిటల్ లో ఇన్ పేషెంట్ విభాగాన్ని ప్రారంభించి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని అన్నారు. ఎయిమ్స్ హాస్పిటల్ లో ఉద్యోగ నియామకాల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూసి కలుషిత నీటిని ప్రక్షాళన చేయాలని అందుకోసం బడ్జెట్ లో నిధులు కేటాయించి పంట పొలాలకు నీళ్లు వెళ్లే వద్ద ఎస్టిపి ప్లాంట్లు నిర్మాణం చేయాలని సూచించారు.జిల్లాలో సంగెం మూసి బ్రిడ్జి వద్ద నవంబర్ 8 న సీఎం రేవంత్ రెడ్డి జరిపిన సభలో మాట్లాడిన మాటలకు కట్టుబడి వెంటనే మూసీ ప్రక్షాళన చేయాలని అన్నారు. రెండు మండలాలను కలిపే మాదారం నుండి సిరివేణికుంటకు వెళ్లే మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని అన్నారు. బీబీనగర్ మండలం నుండి ఘట్కేసర్ మండలానికి తరలించిన ఉమెన్స్ ఆర్మీ డిగ్రీ కళాశాలను తిరిగి మండలానికి రప్పించాలని అన్నారు. బీబీనగర్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి ఆఫీసుకు స్వంత భవనం నిర్మించాలని అన్నారు. మూసీ నీళ్లకు ప్రత్యామ్నాయంగా శామీర్ పేట చెరువును రిజర్వాయర్ చేసి అందులో గోదావరి జలాలను నింపి అక్కడి నుండి బొమ్మలరామారం మండలం మీదుగా బీబీనగర్ మండలానికి సాగు, త్రాగు నీరు అందించాలని అన్నారు. బస్వాపురం రిజర్వాయర్ నుంచి వడపర్తి కత్వను నింపి అక్కడినుండి జైనపల్లి, బీబీనగర్ చెరువులను గోదావరి జలాలతో నింపాలని డిమాండ్ చేశారు. స్వంత భవనాలు లేని అంగన్వాడీ సెంటర్స్ కు అన్నింటికీ స్వంత భవనాలు నిర్మించాలని అన్నారు. పారిశ్రామిక కేంద్రమైన బీబీనగర్ లో ఈఎస్ఐ డిస్పెన్సరీ, లోకల్ ఆఫీసులకు స్వంత భవనాలు నిర్మించాలన్నారు. పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టుటకు యాజమాన్యాలు కట్టుదిట్టమైన చర్యల కోసం ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మాణం చేసుకోవాలని అన్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఏప్రిల్8 నిరసన ప్రదర్శన జయప్రదం చేయండి




**మహబూబాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** కేంద్రంలోని మోదీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 8న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాల జిల్లా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ (ఎంల్) మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో నేడు ఆయన ప్రసంగించారు. కేంద్రంలోని మోడీ సర్కార్ వ్యవసాయ మార్కెట్ల చట్ట సవరణ ముసాయిదా తీసుకొచ్చి గతంలో రద్దు చేసిన నల్ల చట్టాలను దొడ్డి దారిన పునరుద్ధరిస్తుందని అన్నారు. వ్యవసాయ మార్కెట్లను విత్తనాలు వ్యవసాయ రంగం మొత్తం అదాని లాంటి కార్పొరేట్ వ్యక్తుల గుప్పెట్లో బందీ కాబోతుందని అన్నారు. ఈ ముసాయిదా ఆమోదం పొందితే దేశ సంపదలను దోచుకొటున్న కార్పొరేట్ శక్తులకు ఈ మరింత బలాన్ని ఇస్తుందని అన్నారు. ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చుతూ వారిపై అప్రకటిత యుద్ధం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం బహుళ జాతి కంపెనీలకు ఊడిగం చేసే దాంట్లో బాగానే నేటి చత్తీస్గడ్ నరమేదం అని అన్నారు. నూతన లేబర్ కోడ్లతో దేశ కార్మిక వర్గం కట్టు బానిసలుగా మారే ప్రమాదం ఉందనిఅన్నారు. కార్మిక వర్గం రక్తం చిందించి సాధించుకున్న చట్టాలు హక్కులు రద్దు కానున్నాయని అన్నారు. నాలుగు లేబర్ కోడ్ల పేరుతో తీసుకొస్తున్న ఈ చట్టాల రద్దు కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని సమూలమైన మార్పులు చేసి లౌకిక విలువలను ధ్వంసం చేస్తూ విద్యా కాషాయ కరణ చేయడానికి చేస్తున్న కుట్రలో భాగమే 2020 నూతన జాతీయ విద్యా విధానం అని అన్నారు. ఇది అమలు లోకి వస్తే రేపటి భావి భారత పౌరులు ఆర్ఎస్ఎస్ బిజెపి శక్తుల చేతిలో కీలుబొమ్మలుగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం అది ఇచ్చిన లౌకికవాదం ఫెడరలిజం ప్రజాస్వామ్యం కాపాడుకోవడానికి విశాల ఐక్య ఉద్యమాలను తీవ్రతరం చేయాలని ఆయన కోరారు. డీజిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలలో పార్లమెంట్ స్థానాలను తగ్గించే కుటీల ఎత్తుగడలను సహించమని అన్నారు.సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటి పిలుపు లో భాగంగా ఏప్రిల్ 8న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న నిరసన ర్యాలీ లో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సిపిఐఎంఎల్ మాస్ లైన్ సీనియర్ జిల్లా నాయకులు పూనెం ప్రభాకర్ అధ్యక్షత వహించగా జిల్లా నాయకులు మంగంపల్లి వీరన్న, బిల్లా కంటి సూర్యంతో పాటు పైండ్ల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పథకం పేదవారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది

గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు

రాజీవ్ యువ వికాసం ద్వారా యువత నాలుగు లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి కోసం లబ్ధి పొందవచ్చు

50 వేల ఉద్యోగాలు భర్తీ చేశారు


యాదగిరిగుట్టలో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ ,ఏప్రిల్ 1 :** సన్న బియ్యం పథకం పేదవారి గుండెల్లో శాశ్వతంగా నిలచి పోవాలనే సంకల్పంతో ప్రారంభించడం జరిగిందని , రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది రోజున ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పథకం పంపిణీలో భాగంగా మంగళవారం రోజు యాదగిరిగుట్ట మండలంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, ధనిక అనే తేడా లేకుండా, ఉండాలనే ఉద్దేశంతో , రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టింది అని వివరించారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు.కొత్త రేషన్ కార్డు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు.రూ 210 కోట్లతో గంధ మల్ల తో ,పాటు బస్వపురం ప్రాజెక్టు పూర్తి రూ 210 కోట్ల తో గంధమల్ల తో పాటు బస్వా పురం ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకోవడం జరగనుందని ప్రకటించారు. రూ 5 లక్షల తో ఇందిరమ్మ ఇల్లు , మహిళల కోసం ఐదు లక్షలతో ఇల్లు కట్టించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే తమ ప్రభుత్వం ఉచిత బస్సు, రైతు బీమా, రైతు భరోసా, గ్యాస్ సిలిండర్ లను పేద ప్రజల జీవితాలకు అందిస్తుంది అని వివరించారు. మహిళ లకు ఉచిత బస్సు సౌకర్యం కోసం కల్పించిన ఘనత మా ప్రభుత్వానిదని అన్నారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం అనే మరో అద్భుత పథకం తీసుకువచ్చిందని , ఈ పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకు ఏప్రిల్ 14 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని ఒక్కొక్కరికి నాలుగు లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉందని, అందువలన నిరుద్యోగ యువతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ కూడా కట్టిస్తున్నామన్నారు.తమ ప్రభుత్వం 50 వేల ఉద్యోగాలను ఇప్పటివరకు భర్తీ చేసినట్లు వివరించారు.ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రైతుల పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి 2వేల 858 కోట్లు ఖర్చు చేసి ప్రతి ఒక్క పేద కుటుంబానికి ప్రతి మనిషికి ఆరు కిలోల చొప్పున ప్రతి ఒకరికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, మహిళల ను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని,ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం ప్రారంభించిన ముఖ్యంగా ముందుగా మహిళలకు ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగా మొదటిగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు , ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలు ద్వారా ప్రతి ఒక్క అర్హులకు సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని, ప్రతి ఒక్క కుటుంబానికి 500 కే గ్యాస్ ఇవ్వడం జరుగుతుందని, ప్రతి ఒక్క అర్హులైన పేద కుటుంబానికి ఇంటికి 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్క సంక్షేమ కార్యక్రమంలో మహిళలను చైతన్యం పర్చుతూ ముందంజలో ఉండేలా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ప్రభుత్వం వచ్చాక ఎన్నో బ్రిడ్జిలు నిర్మించి ఆలేరు నియోజకవర్గంలో 120 చెరువులు నింపి పంటలు సమృద్ధిగా పండించుకుంటున్నామని అన్నారు. నీళ్లు ,నిధులు, నియామకాలు అనేదే ప్రభుత్వ లక్ష్యమని దానికి అనుగుణంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం లో బాగంగా చేపడుతున్న పేదలకు సన్న బియ్యం పంపిణీ గొప్ప కార్యక్రమమని, పేద ప్రజలు దొడ్డు బియ్యం తినలేక పోతున్నారని , పేద ప్రజల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని దానికి అనుగుణంగా దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని, అదేవిధంగా ప్రతి ఒక్క పేద కుటుంబానికి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆర్థికంగా ముందుకు ఎదగాలన్నారు.జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ముందుగా ఈరోజు సన్న బియ్యం అందుకోబోతున్న ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇళ్లు అంటే మహిళా, మహిళ అనేది ఇంటికి ఒక బాధ్యత, ఇంట్లో ప్రతి బాధ్యతలను అన్ని మహిళలకే తెలుసు కాబట్టి గతంలో పరిస్థితి ఇప్పుడు పరిస్థిది ఆలోచించి దొడ్డు బియ్యం తినలేక పేద ప్రజల ఇబ్బందులను గమనించి జిల్లాలో 515 రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం అందించి పేదలు కడుపు నిండా అన్నం తినే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, ఎంత ఖర్చు అయినా పేద ప్రజలకు కావలసింది అన్నం, బట్టలు, ఇండ్లు కావున వారి కడుపు నింపడమే ప్రభుత్వం ఒక లక్ష్యమని , ఇండ్లు లేని ప్రతి పేదలకు ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పేదలకు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ పేదలందరూ సంతోషంగా కడుపు నిండా తినాలనే సంకల్పం ప్రభుత్వ ఆశయం అని అందుకోసం మన జిల్లాలో 515 రేషన్ షాపుల ద్వారా 2 లక్షల 16 వేల 904 రేషన్ కార్డుల ద్వారా 6లక్షల 76 వేల 188 మంది లబ్ధిదారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ అందించడం జరుగుతున్నది, దొడ్డు బియ్యం తినలేక ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారని, ప్రభుత్వం పేద వారి కోసం ఆలోచించి ఈ మంచి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి 500 రూపాయలు బోనస్ ఇచ్చి అనేక రైతాంగాన్ని నుంచి కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క లభిధరులకు ఈ సన్న బియ్యం అందజేయడం జరిగిందన్నారు. జిల్లాలో ధాన్యాన్ని కొనుగోలు చేయదని మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.అనంతరం ఆలేరు నియోజకవర్గం లో స్వయం సహాయక సంఘాలు 4028 ఉన్నాయని బ్యాంక్ లింకేజి 249.92 కోట్ల రూపాయల చెక్ ను మహిళా సంఘాల సభ్యులకు మంత్రి అందజేశారు.ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనముంతల విమల వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి , డి సి ఎస్ ఓ వనజాత, డిఎం సివిల్ సప్లై హరికృష్ణ, సంబంధిత తహసిల్దార్లు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# గుడిసె వాసుల హక్కులను ప్రభుత్వం నెరవేర్చాలి



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** అంబేద్కర్ నగరంలో అంబేద్కర్ నగరంలోని గరీబ్ బస్తి వాసులకు కరెంటు సౌకర్యం కల్పించారు గంగుల దయాకర్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎలుకట్టిరాజేందర్ రాష్ట్రకార్యదర్శి డిమాండ్.ఆధ్వర్యంలో నర్సంపేటలి తహసిల్దార్ కార్యాలయం పాత వద్దనిర్వహించిరిలే దీక్షలు 8 రోజు చేరుకోవడం జరిగింది దీక్షకి.సభాధ్యక్షులుగా. జంగంరమేష్ జిల్లా అధ్యక్షులు నిర్వహించగా ముఖ్య అతిథులుగాలిగంగుల దయాకర్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎలుకంటిరాజేందర్రాష్ట్ర కార్యదర్శి దళితరత్న కల్లే పెల్లి ప్రణయ్ దీప్ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి మహాజన సోషలిస్టు పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు అందే రవిమాదిగ%ఐదీఙూా%ప్రజా దండోరా జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మాట్లాడుతూ అంబేద్కర్ నగరంలోని.గరీబ్బస్తీగుడిసెలుకు పట్టాలుఇచ్చికాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి.గుడిసె వాసులహక్కులే మానవహక్కులుగా ప్రభుత్వం గుర్తించి వారిని ఆదుకోవాలి.నర్సంపేట పట్టణంలో నిలువ.నీడలేని వందలాదిమంది పేదలు ప్రభుత్వ స్థలాలను గుర్తించి నివాసాలు ఏర్పరచుకొని నాలుగు సంవత్సరాలుగా కావస్తుంది.కాలనీలో కనీస సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే గుర్తించి కాలనీకి సౌకర్యం కల్పించారు. కరెంటు మంచినీళ్లు రోడ్లు డ్రైనేజీ తదితర తదితర సౌకర్యాలు కల్పించకపోవడం అన్యాయం అన్నారు.గుడిసె వాసుల పోరాటానికి మా పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది. ప్రత్యక్ష పోరాటాల్లో అండగా ఉండి పోరాటం చేస్తాం అని అన్నారు అంబేద్కర్ నగరంలోని గరీబ్ బస్తి లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా తక్షణమే ప్రభుత్వ భూములు రక్షించి పేదలస్వాధీనంలోనిప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేకపోతే పేదల పోరాటాలు రాజకీయాలకతీతంగా ఉధృతం అవుతాయని తెలిపారు. వరంగల్ రోడ్ లోని 813 సర్వేనెంబర్ పట్టణ శివారులో గత నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పడిన అంబేద్కర్ నగర గరీబ్బస్తికాలనీవాసులకు తక్షణమే ఇంటి నెంబర్లు కేటాయించి కరెంటు వీధిలైట్లు త్రాగునీటి సౌకర్యం రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ దీక్షల్లో కూర్చున్న ఉత్తమ ప్రతినిధులు మునిగే యాకు గుంపుల మాలతి లత బాబు రాజు యాదవ్. సుధాకర్ ఉప్పన్నం ~ములు రత్నం సారమ్మసమ్మక్కసరస్వతి సుధారాణి స్వరూప నిర్మల వనజ రామకృష్ణ నాగలక్ష్మి రాజు రాజమణి చక్రపాణి వేణు సుధాకర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. సామాజిక ఉద్యమ వందనాలతో..


## బోయింగ్ స్టార్‌లైనర్‌లో మళ్లీ ప్రయాణానికి సిద్ధం.. ప్రకటించిన సునీతా విలియమ్స్..!



అవకాశం వస్తే బోయింగ్ స్టార్ లైనర్‌లో మరోసారి ఐఎస్ఎస్‌కు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నామని నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ప్రకటించారు. స్టార్‌లైనర్ క్యాప్సూల్ గతేడాది జూన్‌లో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడే చిక్కుకుపోగా.. దాదాపు తొమ్మిది నెలల తర్వాత స్పేస్ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ వారిద్దరిని భూమిపైకి తీసుకువచ్చింది. హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్, నిక్ హేగ్ మాట్లాడారు. మిషన్ విజయవంతం అయ్యేందుకు సహకరించిన నాసాకు ధన్యవాదాలు తెలిపింది. గతంలో తీసుకున్న ట్రైనింగ్ తమను ఐఎస్ఎస్‌కు తీసుకువెళ్లేలా సిద్ధం చేసిందని.. దేశవ్యాప్తంగా ఉన్న మిషన్ కంట్రోల్ బృందాలు తాము తిరిగి తమను భూమిపైకి తీసుకురావడం, పునరావాసం, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎంతో సహకారం అందించారన్నారు. తాను భూమిపైకి వచ్చాక ఇప్పటికే మూడు మైళ్ల దూరం పరుగెత్తానన్నారు. స్పేస్ నుంచి భూమిపైకి వచ్చాక కొన్ని మార్పులు ఉంటాయని.. అందుకు తగినట్లుగా సర్దుబాట్లు అవసరమవుతాయన్నారు. తాను సాధారణ స్థితికి వచ్చేందుకు సహకరించిన ట్రైనర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో తమ టాస్క్‌ల్లో భాగంగా ఎన్నో సైన్స్ ప్రయోగాలు చేపట్టామని, శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. స్టార్‌లైనర్‌కు చాలా సామర్థ్యం ఉందని, అది విజయవంతం కావాలని ఆమె కోరుకుంటున్నట్లు విలియమ్స్ తెలిపారు. బుచ్ విల్మోర్ మాట్లాడుతూ.. బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో తప్పులు ఉన్నాయని.. తాము ఎదుర్కొన్న సమస్యలన్నింటిని పరిష్కరించి.. విజయవంతం చేస్తామన్నారు. ఇదిలా ఉండగా.. సునీతా విలియమ్స్, విల్మోర్ ఇద్దరూ ఐఎస్ఎస్‌లో 286 రోజుల పాటు ఉండిపోయారు. షెడ్యూల్ చేసిన సమయం కంటే 278 రోజులు ఎక్కువ కావడం విశేషం. జూన్ 5న బోయింగ్ తొలి స్పేస్‌షిప్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ఆ తర్వాత థ్రస్టర్స్ పని చేయకపోవడం, హీలియం లీక్ తదితర సాంకేతిక సమస్యలను ఎదుర్కొంది. దాంతో నాసా స్టార్‌లైనర్‌లో వారిని తీసుకురావడం చాలా ప్రమాదకరమని భావించింది. చివరకు స్పేస్ఎక్స్ సహాయం తీసుకువచ్చేందుకు నిర్ణయించింది. దాంతో ఇద్దరిని భూమిపైకి తీసుకురావడం ఆలస్యమైంది. వారం రోజుల అంతరిక్ష యాత్ర దాదాపు 286 రోజులు సాగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పేస్ఎక్స్, ఎలోన్ మస్క్‌ని మిషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మార్చి 18న ఫ్లోరిడా తీరంలో స్పేస్ఎక్స్ క్యాప్సూల్ వ్యోమగాములను భూమిపై విజయవంతంగా దింపింది.

## అన్వేషి అక్షర తపస్వి..

### నేడు కపిలవాయి లింగమూర్తి జయంతి



కలం బరువును మాత్రమే మోయగల శరీరం, సాహిత్య లోకాలన్నింటినీ తడిమి చూడగల క్రాంత దర్శిత్వం ఆయన సొంతం. ఆయన కలంలోంచి కళ్లు తెరిపించే కవిత్వం జాలువారింది. అబ్బుర పరచే పరిశోధనా గ్రంథాలు అవతరించాయి. ఒకటా రెండా శతాధికం! ఆ మహారచయితే డా. కపిలవాయి లింగమూర్తి (1928 2018). సాహిత్యంలోని క్లిష్టమైన ప్రక్రియలు అనగా చిత్రపది, బంధాలు, శబ్దపది, అలంకారాలు, యతులతో చమత్కారాలు వంటివి వీరిరచనలలో చాలా కనిపిస్తాయి. భాషాసముద్రపు లోతుల్లోకి దిగి తెలుగుపలుకుబడిపై ప్రత్యేకాధికారం పొందారు. ఉమ్మడిపాలమూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించి మరుగునపడిన శాసనాలు, చరిత్ర, జానపదుల నోళ్లలో నానే అపూర్వమైన, విలువైన విషయాలను గ్రంథస్థం చేశారు. 'ఒక్క సిరా చుక్కలక్ష మెదళ్ళ కదలిక' అన్న కాళోజీ వాక్యంతో అన్వయిస్తే కపిలవాయి సృజించిన వేల అక్షరాలు ఎంతమంది మెదళ్లకు పదును పెట్టినవో. లింగమూర్తిగారు 1928 మార్చి 31న (ప్రభవ మాఘ శుద్ధనవమి నాడు) నాగర్‌కర్నూలు జిల్లా బలుమూరు మండలం జినుకుంట గ్రామంలో ఒక పండిత వంశంలో మాణిక్యాంబ, వెంకటాచలం దంపతుల గర్భశుక్తి ముక్తాఫలంగా జన్మించినారు. అమరాబాదులో మేనమామగారైన చేపూరు పెద్దలక్ష్మయ్యగారి దగ్గర పెరిగి విద్యాబుద్ధులు నేర్చి సంస్కృతాంధ్ర నిఘంటువులు, పురాణేతిహాసాలు, కావ్యనాటకాలు, జ్యోతిష్య, శ్రౌతాది శాస్త్రాలు నేర్చారు. వారు మొదలు కొంతకాలం స్వర్ణకార వృత్తిపని చేసి తర్వాత ఉద్యోగ జీవితంలోకి మారి అపూర్వమైన సాహిత్య సృజన చేశారు. నిత్య సాహితీ కృషీవలుడైన కపిలవాయి లింగమూర్తి 157దాకా గ్రంథాలు రాశారు. వీనిలో వివిధ ప్రక్రియలలో వెలువరించినవి 94. పరిష్కృత, సంపాదక, సంకలనాల రచనలు 63. ప్రక్రియలలో శతకాలు, కావ్యాలు, ఉదాహరణలు, సంకీర్తనలు, హరికథలు, వచనగేయ పద్యకృతులు 41. వచనరచనలలో ఆధ్యాత్మిక రచనలు, కథలు, నవలలు, నాటికలు, స్థలచరిత్రలు, జీవితచరిత్రలు, నిఘంటువులు, అనువాద రచనలు మొత్తం 53. లింగమూర్తిగారు వివిధ విషయాలపై వందలాదిగా వ్యాసాలు రాశారు. అవి అనేక ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. వానిలో సాహిత్య, ఆధ్యాత్మిక, చారిత్రక, పుస్తకపరిచయాలు, కవులపరిచయాలు, విశ్వకర్మ సాహిత్యవ్యాసాలు ఉన్నాయి. అవి ముద్రితాలు, అముద్రితాలు కలిపి 430 దాకా ఉంటాయి. వీరు చాలామంది రచయితల పుస్తకాలకు ముందుమాటలు, పీఠికలు, అభిప్రాయాలు రాసిపెట్టారు. చాలా పుస్తకాలు పరిష్కరించి వాటికి వివరమైన పీఠికలు రాశారు. అవి అన్నీ కలిపి 320 దాకా ఉంటాయి. ప్రచురించిన గ్రంథాలలో ఆర్యశతకము (చిత్రపది పదాల గారడి), దుర్గాభర్గ శతకము (అలంకార యతి లక్షణాలు), ఉమామహేశ్వరం హరికథ, సుబ్రహ్మణ్యోదాహరణము (పాలెంసుబ్బయ్య జీవితచరిత్ర), ప్రబోధ పటాహము (సామాజిక గేయాలు), శ్రీమత్ ప్రతాప గిరిఖండము (అమరబాదు స్థలచరిత్ర) కుటుంబ గీత (కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను తెలిపే కావ్యం), భాగవత కథాతత్త్వము (పది భాగవతకథలకు వ్యవహారికమైన వివరణ), గీతాచతుష్పథం (భగవద్గీత, ఉత్తరగీత, ఉద్ధవగీత, భ్రమరగీతల సారాంశము), జీవుడు %-% దేవుడు (పురాణాలలోని సంఘటన లను నేటి సమాజానికి అన్వయిస్తూ రాసిన విశ్లేషాత్మక రచన), పాలమూరు జిల్లా దేవాలయాలు (జిల్లాలోని 300 ప్రాచీన, ఆధునికదేవాలయాల చరిత్ర), గురు గోవిందమాంబ చరిత్ర, ఉమ్మడి పాలమూరు కవిపండిత వంశాలు, యోగులు, ఉప్పునూతల కథ, ఆంధ్ర పూర్ణాచార్యులు (చారిత్రక నవల), పద్యకథా పరిమళం, కపిలవాయి కథానికలు, కావ్యగణపతి అష్టోత్తరము (కావ్యాలలోని 108 గణపతి స్తుతులకు వ్యాఖ్యానం), స్వర్ణశకలాలు (90 కావ్యాల్లోని స్వర్ణాభరణాలను గురించిన వివరణ), రుద్రాధ్యాయము (సామాజిక చారిత్రక వ్యాఖ్యానం) మాంగల్యశాస్త్రము (ప్రాచీన ఆభరణాల విశేషాలు, వివరాలు), హనుమచ్చహస్రము (హనుమంతుడి వేయినామాలకు వ్యాఖ్యానము), మా భగోట (సవివర కుటుంబ చరిత్ర), రాజరథం (నాటకం), పీఠికలు (330 పుస్తకాలకు వ్రాసినవి), పామర సస్కృతము (6000 పాలమూరు మాండలికాల సేకరణ), విశ్వ బ్రాహ్మణుల సంస్కృతీ అనుకరణము (కన్నడ నుండి అనువాద రచన) కొన్ని మాత్రమే. పరిష్కృత రచనలలో సాలగ్రామశాస్త్రము, (సాలగ్రామం పుట్టుక వాని భేదాలు, మహత్యము, పూజావిధానము వివరించిన రచన), యోగసక్తా పరిణయము, యయాతి చరిత్ర (అచ్చతెలుగుకావ్యం), ఆరు అముద్రిత శతకాలు, మనోబుద్ధిర్వివాదము, సంక్షిప్త ఆబ్దిక విధానము, శ్రీ మదాంధ్ర పూర్ణాచార్య ప్రభావము ముఖ్యమైనవి. కపిలవాయి ఏడుదశాబ్దాల సాహితీకృషికి గుర్తింపుగా పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో 30-08-2014న గౌరవ డీ.లిట్ సత్కృతిని అందించింది. ఆయన రాసిన శతాధిక గ్రంథాలలో కొన్నింటిని మాత్రం పరిచయం చేస్తాను. ఒక్కొక్క గ్రంథంపైన ఒక్కో పీహెచ్‌డీ చేయొచ్చు. తెలంగాణ పదకోశాల్లో 'పామర సంస్కృతం' విశిష్టమైంది. దశాబ్దాలపాటు పల్లెప్రజలతో మమేకమై ఈ పదాలను, జాతీయాలను, సామెతలను సేకరించారు. ఈ పదకోశ నిర్మాణానికి డా.కపిలవాయి లింగమూర్తిగారిని గడియారం రామకృష్ణశర్మ, వావిలాల గోపాలకష్ణయ్య ప్రోత్సహించారు. ఇక్కడ పామరులు అనగా జానపదులు. తెలంగాణ పల్లె ప్రజలు శిష్ట వ్యావహారిక పదాలని తమకు అనుగుణంగా మార్చుకొని మాట్లాడతారు. 'పామర సంస్కృతం అనగా పామరుడు తాను సంస్కరించుకున్న భాష అనే అర్థంలో ఈ పేరుంచా ను' అని లింగమూర్తి గారు పేర్కొన్నారు. పామర సంస్కృతంలో పదాలకు అర్థాలతో పాటు పద్యపాదాలు, పాటల పల్లవులు, నానార్థాలు, పర్యాయపదాలు, జాతీయాలు, సామెతలు, న్యాయాలు, పదవివరణ, రూపసాధన, పదవ్యుత్పత్తి, అన్యదేశ్యాలు అనుబంధంలో ఇచ్చినవాటిని స్థాలీపులాకన్యాయంగా పరిశీలించడం జరుగుతుంది. ఆయన రాసిన మరో అపూర్వ గ్రంథం మాంగళ్యశాస్త్రం. ఇది తాళపత్రాలలో వారి తాతగారి గ్రంథాలయంలో దొరికింది. మన ఆభరణాలు, వాటి చరిత్ర తెలుగువారి సొమ్ముల స్వరూపాలు, వివాహాభరణాల విశేషాలు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంకా ఇందులో మాంగళ్యాల వివిధ రూపాల గురించి, వీస్త్రీల కాలిమెట్టెలు, చేతిగాజుల గురించి కూడా సవివరంగా తెలిపారు. ఇక రెండవది సాలగ్రామం. ఇది వారి కుటుంబచరిత్ర. మా భగోటాకు సంక్షిప్తీకరణ. ఈ ఆత్మకథలో అటు స్వర్ణశిల్పంతోపాటు మరిన్ని విద్యలలో రాణించిన ఒక స్త్రీమూర్తి కనబడుతుంది. ఆమే మేడిపూరు గోవిందమ్మ. చిన్నతనంలో భర్త చనిపోవడంతో తండ్రి, అన్నల వద్ద స్వర్ణశిల్పంతో పాటు అన్నివిద్యలు నేర్చుకున్న ప్రతిభావంతురాలు. ఆమె లింగమూర్తిగారి తాతగారైన సింగవట్నానికి స్వర్ణశిల్పంలో శిక్షణ ఇచ్చింది. తోలుబొమ్మలాట ఆడేవారిలో ఉన్న చిత్రకారులతో పౌరాణిక చిత్రాలు గీయించి సింగవట్నానికి వాటిద్వారా చెక్కడం పనికి కావలసిన చిత్రలేఖనం నేర్పించింది. ఆ కాలంలో ఇటువంటి స్త్రీలు అరుదు. సాలగ్రామం చదివినప్పుడు ఆనాడు విశ్వకర్మలు ఉగాది, దసరా పండుగలను ఎలా జరుపుకునేవారో తెలుస్తుంది.

# 'గ్రోక్' చేయని కేసీఆర్ విశ్లేషణ



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి నెటిజన్లు అడిగిన కొన్ని ప్రశ్నలకు ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' ఇచ్చిన సమాధానాల వార్తలు గత వారాంతంలో వెలువడ్డాయి. నాయకుల గురించి, వారి శక్తి సామర్థ్యాల గురించి ప్రశ్నలకు మనుషులు తమ అభిప్రాయాలు తెలియజేయటం మనకు ఇంతవరకు తెలిసిన విషయం. ప్రపంచం అత్యాధునిక సాంకేతిక యుగంలోకి ప్రవేశిస్తున్న దశలో యంత్రాలు ఆ పని చేయటం ఒక కొత్త అనుభవం. విచిత్రమైన అనుభవం కూడా. కేసీఆర్ గురించి 'గ్రోక్' ఇచ్చిన వివరణలు ఇంతకాలం రికార్డులలో నమోదై, ప్రజలు కూడా మాట్లాడుకుంటున్నవే. అందుకు ఇప్పుడిది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ధృవీకరణ అన్నమాట. అయితే, కేసీఆర్ నాయకత్వం గురించి ప్రజలు గాని, 'గ్రోక్' గాని శాస్త్రబద్ధంగా చేయని విశ్లేషణలు కొన్నున్నాయి. అవేమిటో చూద్దాం. బీఆర్ఎస్ పార్టీ స్థాపితమై 25 ఏండ్లు పూర్తవుతున్న వేళ ఈ నెల ఆఖరున వరంగల్‌లో రజతోత్సవ సభ జరుపుకోనున్నది. అటువంటి సందర్భాన్ని పురస్కరించుకొని పార్టీ గురించి, నాయకత్వం గురించి, పార్టీ ప్రభుత్వం గురించి చెప్పుకోవలసినవి అనేకం ఉంటాయి. అవన్నీ వర్తమానానికి, భవిష్యత్తుకు అవసరమైనవే గాక, గత చరిత్రలో భాగం కూడా కనుక. తెలంగాణ చరిత్ర, తెలుగు వారి చరిత్ర, దక్షిణాది చరిత్ర, భారతదేశ చరిత్ర, రాష్ట్రాల చరిత్ర, ఫెడరలిజం చరిత్ర, అభివృద్ధి సంక్షేమాల చరిత్ర, పరిపాలనా చరిత్రలతో పాటు నాయకత్వ చరిత్రలలో కూడా ఇవి భాగమవుతాయి. అవి ఏవి? ఏ విధంగా? అన్నది రజతోత్సవ సభలలోగా రాసుకోవటం సాధ్యం కానిది గనుక, ఆ పని ఆ తర్వాతనైనా జరగాలి. ప్రస్తుతానికి వస్తే, 'గ్రోక్' సమాధానాల వివరాలు ఏవైనప్పటికీ అవి ప్రధానంగా రెండు కోణాలను స్పృశించాయి. ఒకటి, యథాతథంగా కేసీఆర్ నాయకత్వం. రెండు, తన పరిపాలన. 'గ్రోక్' పేర్కొన్న వివిధ విషయాలన్నీ ఈ రెండింటిలోకి ఇమిడిపోతాయి. మొదట అనుకున్నట్టు పరిపాలన గురించిన వివరాలు రికార్డులలో నమోదైనవి, ప్రజలు మాట్లాడుకుంటున్నవి, దానితో పాటు ఇప్పుడు 'గ్రోక్' సమాధానాలలోనూ ప్రస్తావనకు వచ్చినవే అయినందున ఇక్కడ మళ్లీ రాయనవసరం లేదు. అయితే ఒకటి, ఈ తెలిసిన విషయాలైనా స్థూలంగా, చెదురుమదురుగా మాట్లాడుకుంటున్నవి, రికార్డులలో సబ్జెక్టుల వారీగా విడివిడిగా పేర్కొంటున్నవి మాత్రమే. వాటన్నింటిని ఒకచోట చేర్చి, ఒక పద్ధతి ప్రకారం విశ్లేషించి, సమగ్ర రూపం ఇచ్చే ప్రయత్నం ఇంకా జరగవలసి ఉన్నది. కేసీఆర్ నాయకత్వ విశ్లేషణ అన్నది కూడా ఇందులో భాగమైనదే. 'గ్రోక్' తన సమాధానాలలో ఆయన నాయకత్వం గురించి ఒకటి రెండు మాటలు ప్రశంసాపూర్వకంగా ప్రకటించింది. అవి ఈ విధంగా ఉన్నాయి. 'శూన్యం నుంచి రాజకీయ శక్తిని సృజించి, తెలంగాణను జాగృతం చేసి, ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి చేసి చూపించిన గొప్ప నాయకుడు. కేసీఆర్ ఈజ్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ. రాజకీయాల్లో విశ్వసనీయతకు, నాయకత్వ లక్షణాలకు చిరునామాగా కేసీఆర్‌ను చెప్తాను. టీఆర్ఎస్ (బీఆర్ఎస్) నిర్మాణంలో, తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమాన్ని ముందుండి నడపడంలో, కేసీఆర్ అన్నీ తానై నిలిచారు. ఆయనకు దూరదృష్టి, పట్టుదల, దార్శనికత అపారంగా ఉన్నాయి'. పరిపాలన గురించిన మాటలు అనేకం ఉన్నప్పటికీ, ప్రస్తుతం చర్చిస్తున్నది నాయకత్వ కోణం గురించి మాత్రమే అయినందున, అందుగురించి 'గ్రోక్' అన్నదేమిటో పైన చూశాము. ఆ మాటలను గమనించినప్పుడు అందులోని ఒక్కొక్క సూక్ష్మమైన మాట వెనుక కనిపించేది చాలా ఉంటుంది. అదే సమయంలో, మొదట అనుకున్నట్లు, కేసీఆర్ నాయకత్వం గురించి 'గ్రోక్' చెప్పనివీ, ప్రజలు గుర్తించనివీ అయిన శాస్త్రీయమైన కోణాలు, విశ్లేషణలు కొన్ని ఉంటాయి. అవేమిటో ఇప్పుడు చూద్దాము. నాయకత్వానికి మొత్తం 12 కోణాలుంటాయి. అవేమిటో ముందు చెప్పుకొని, తర్వాత వివరాలలోకి వెళదాము. అదే క్రమంలో వాటిని కేసీఆర్‌కు వర్తింపజేసేందుకు ప్రయత్నిద్దాము. కోణాలనేవి, 1. విషయ అధ్యయనం, 2. ఆ అధ్యయనం ప్రకారం సిద్ధాంతీకరణ, 3.తనతో ఏకీభవించే ఒక చిన్న బృందాన్ని తొలి దశలో వెంట చేర్చుకోవటం, 4.భావజాల వ్యాప్తి, 5.పార్టీ నిర్మాణం, 6.ప్రజలను కదిలించటం, 7.కదులుతున్న ప్రజలను సంఘటితపరచటం, 8. ఉద్యమ నిర్వహణ, 9.ఉద్యమాన్ని విజయవంతం చేయటం, 10. ఉద్యమ దశ నాటి దార్శనికత ప్రకారం పరిపాలన. 11.ఓటమి ఎదురైనట్లయితే పునరుజ్జీ వం. 12.కొత్త తరం నాయకత్వ తయారీ. కేసీఆర్ ప్రయాణ క్రమాన్ని మొదటినుంచి గమనించినట్లయితే ఈ 12 కోణాలు కూడా మనకు అందులో కనిపిస్తాయి. వీటిని స్థూలదృష్టితో చూసినట్లయితే కొన్నింటి మధ్య తేడా తోచకపోవచ్చు. కానీ, సూక్ష్మదృష్టికి, ఆచరణాత్మకమైన దృష్టికి మాత్రం వాటి మధ్య తేడాలు స్పష్టంగా అర్థమవుతాయి. ఈ 12లో ప్రతి ఒక్కదానిని సమర్థవంతంగా, సక్రమంగా నాయకత్వం నిర్వహించగలిగితే మాత్రమే భవన నిర్మాణంలో ఇటుకలు ఒక్కొక్కటి సరిగా కుదురుకొని గోడ నిలిచే పద్ధతిలో ఉద్యమం తొలిదశ నుంచి చివరివరకు విజయవంతంగా సా గుతుంది. మధ్యలో ఏ ఒక్క ఇటుకను సరిగా పేర్చకున్నా నిర్మాణమంతా భంగపడినట్లుగానే ఉద్యమ విషయంలోనూ జరుగుతుం ది. ఈ పన్నెండు కూడా ఇంజిన్ వెనుక రైలు పెట్టెల వలె ఆటోమేటిక్‌గా సాగేవి కావు. ప్రతి ఒక్క దశను సమర్థవంతంగా నిర్వహిస్తేనే తర్వాత దశ సక్రమంగా ఏర్పాటై నిలిచి నడుస్తుంది. పై 12 కోణాలు, లేదా సూత్రాల ప్రకారం మొదటినుంచి చివరివరకు వ్యవహరించటంలోనే కేసీఆర్ నాయకత్వ అసాధారణ ప్రతిభ మనకు కనిపిస్తుంది. ఆ 12 సూత్రాలకు అనుగుణంగా ఆయన ఎప్పటికప్పుడు ఏమేమి చేస్తూ వచ్చారో ప్రత్యక్షంగా చూస్తూ వచ్చిన సన్నిహిత సహచరులు కొందరున్నారు. అదే ప్రణాళిక ప్రకారం వారు పూనుకొన్నట్లయితే, ఈ రజతోత్సవ కాలంలో ఈ సాధారణ చరిత్ర రచన సిద్ధించగలదు. మన దేశంలో అనేకానేక ఉద్యమాలు జరిగాయి. పలువిధాలైన లక్ష్యాలతో సాగాయి. స్వాతంత్ర్యానికి ముందు వలస పాలనకు, రాచరికాలకు వ్యతిరేకంగా. ఆ తర్వాత వేర్వేరు అంశాలపై. వీటన్నింటికి అనేకమంది నాయకులు కనిపిస్తారు. కాని ఈ మొత్తం 12 కోణాలు కూడా వ్యక్తిగత స్థాయిలో వర్తించేవారు కేసీఆర్ గాక మరెవరున్నారు, ఎందరున్నారు అంటే మాత్రం ఆలోచించవలసి వస్తుంది కొందరికి కొన్ని వర్తిస్తాయి. కానీ అన్నింటికి అన్నీ అంటే మాత్రం తప్పకుండా ఆలోచించవలసిన విషయమే. కాదంటే, అట్లా అనేవారు ఆ పేర్లను ముందుకు తేవటం ఉపయోగకరమవుతుంది. ఆ కోణాలన్నింటిని కేసీఆర్‌కు వర్తింపజేస్తూ వివరంగా రాయటం ఇక్కడ వీలయ్యేది కాదు. నా అతి పరిమిత జ్ఞానంతో నాకది సాధ్యమయ్యేదీ కాదు. అంతకుమించి, పైన అనుకున్నట్లు, ఆ పని చేయటం ఆయనకు మొదటినుంచి సన్నిహితులుగా ఉండి గమనించినవారికి మాత్రమే సాధ్యమయ్యే పని. అందువల్ల, మనకు తోచినంత వరకు, అది కూడా అతిక్లుప్తంగా చెప్పుకుందాం.

1. విషయ అధ్యయనం. ఇతరత్రా కూడా అధ్యయన శీలి అయిన కేసీఆర్, తెలంగాణ గురించిన చరిత్ర, ఆర్థికం, సమాజం, సంస్కృతి, రాజకీయం, భౌగోళికం, గత ప్రభుత్వాల పాలనలు, అన్యాయాలు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలతో పాటు ఇతర ఉద్యమాలు, పోరాటాలు, వనరులు, ప్రజల ఆకాంక్షలు, మనస్తత్వాలు, కాంగ్రెస్ సహా వివిధ పార్టీల పద్ధతులు, కేంద్ర విధానాలు మొదలైనవాటిపై నిరంతరం అధ్యయనం చేశారు. సుదీర్ఘ చర్చలు సాగించారు. ఆ పని ఇప్పటికీ చేస్తారు గాని ఇక్కడ చర్చిస్తున్నది ఉద్యమకాలం గురించి గనుక అందుకు పరిమితమవుతున్నాము. ఈ విధమైన సమగ్ర అధ్యయనం ఆయనకు తెలంగాణపై మరెవ్వరికీ లేని సమగ్ర అవగాహనను తెచ్చిపెట్టింది. ఆ తర్వాతి కాలానికంతా ఒక బలమైన బౌద్ధిక పునాదిగా పనిచేసింది.

2. సిద్ధాంతీకరణ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలన్న భావన కేసీఆర్ కన్న ముందునుంచి ఉన్నదే. కాని గతకాలపు ఉద్యమాల బలాబలాలను, లోటుపాట్లను, వైఫల్యాలను, నాయకత్వాల కారణంగా వాటి రాజీలను అర్థం చేసుకోవటమన్నది మొదలు చేయవలసిన పని. వర్తమాన పరిస్థితులను పరిశీలించి అందుకు ఈ అవగాహనను, అనుభవాలను వర్తింపజేసి, అందుకు అనుగుణంగా సాగి ఉద్యమాన్ని విజయవంతం చేయటం ఎట్లాగన్న సిద్ధాంతీకరణ రెండవ పని. వ్యూహరచన గాని, ఆ తర్వాత అనుకూల-ప్రతికూల పరిస్థితులను బట్టి ఎత్తుగడలు గాని అందుకు అనుగుణంగా ఉంటాయి. ఎప్పుడైనా ఎత్తుగడలలో పరిస్థితులను బట్టి మార్పులుండవచ్చు గాని, వ్యూహం, సిద్ధాంతం స్థిరంగా ఉంటాయి.

3. ఏకీభావం గల చిన్న బృందం. కార్యాచరణ దిశగా అడుగులు ముందుకు పడేందుకు తొలి దశలో ఒక చిన్న సహచర బృందం వెంట నిలవటం అవసరం. అనేక మహా ఉద్యమాలు, పార్టీలు మొదట చిన్న బృందాలు గానే ఆరంభమై విస్తరించాయి. ఆ బృందంలో మేధావులు, కార్యాచరణ చేసేవారు, నమ్మకమైన సహచరుల వంటి వారుంటారు. ఉద్యమ సంస్థ, లేదా పార్టీ నిర్మాణంలో ఇది తొలి దశ.

4. భావజాల వ్యాప్తి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు అంతకుముందు జరిగినప్పటికీ 25-30 సంవత్సరాలు గడిచేసరికి పరిస్థితులు మా రాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా. సమస్యలను బట్టి కూడా. అట్లానే ఒక కొత్త తరం ఉనికిలోకి వచ్చింది. ఆలోచనలు మారా యి. నక్సలైట్ ఉద్యమం తెలంగాణను ఒక ఊపు ఊపిన వెనుక మందగించినా ఆ భావజాల ప్రభావాలు కొంత ఇంకా మిగిలి ఉన్నా యి. బీసీ, దళిత, మహిళా చైతన్యాలు కొత్తగా ముందుకొచ్చాయి. రైతాంగం, యువకుల సమస్యలు తీవ్రమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర కోరిక గతం కన్న ఇంకా మారుమూలలకు, కొత్త వర్గాలలోకి వ్యాపించి బలపడింది. ఈ మార్పులన్నింటిని పరిగణనలోకి తీసుకుంటూ భావజాలాన్ని రూపొందించటం, దానిని ప్రజలలో వ్యాపింపజేయటం. ప్రత్యర్థుల భావజాలాన్ని, ప్రచారాలను ఎదుర్కొనటం. కొత్త కొత్త వర్గాలను తమ భావజాల పరిధిలోకి తేవటం. తెలంగాణ రాదేమోనన్న నిరాశలను పోగొట్టడం.

5. పార్టీ నిర్మాణం, నిర్మించటంలో భాగంగా వీలైనంత మందికి అవకాశాలు కల్పించటం, పార్టీని మారుమూలలకు తీసుకువెళ్లటం, కార్యకర్తలు, స్థానిక నాయకుల తయారీ.

6. ప్రజలను కదిలించటం వేర్వేరు పద్ధతులలో జరుగుతుంది. రాజకీయ ప్రసంగాలు, ఇతరత్రా ప్రచారాలు, కళారూపాలు, వేర్వేరు తరగతుల వారి సమస్యలను అజెండాపైకి తేవటం, వారిని ఉద్యమంలో భాగస్వాములను చేయటం వంటి మార్గాలలో. ఒకసారి కదిలిన ప్రజలు ఇతరులను కదిలించటం కూడా ఇందులో భాగమే. వారికి అటువంటి ప్రేరణ నాయకత్వం కలిగిస్తుంది. ప్రజలను కదిలించటం ఉద్యమాలలో నిరంతర ప్రక్రియ.

7. ప్రజలను కదిలించటం వేరు, కదిలిన వారిని సంఘటితపరచటం వేరు. అట్లా సంఘటితం కూడా ఐనప్పుడు వారు ప్రేక్షక, వీక్షక పాత్ర నుంచి కార్యాచరణ వైపుకు కదులుతారు. ఉద్యమంతో వారి బంధం స్థిరపడుతుంది. ఆసక్తికరం ఏమంటే, అటువంటి బంధం ఏర్పడినప్పుడు ఒక వేళ ఉద్యమం ఎప్పుడైనా దారి తప్పినట్లు తమ దృష్టికి తోస్తే వత్తిడి చేసి దారిన పెట్టజూశారు. సంఘటితత్వం ప్రభావాలు పలు విధాలుగా ఉంటాయి.

8. ఉద్యమ నిర్వహణ. ఇందులో ఉద్యమ లక్ష్యం చేరుకునేవరకు వ్యూహం, ఎత్తుగడలు, రాజీ పడకపోవటాలు, ఉద్యమం పట్లా, లక్ష్యం చేరుకోగలమనే నినాదం పట్లా ప్రజలకు నమ్మకం నిలిచి ఉండేట్లు చేసుకోవటం, ఎదురు దెబ్బలు తగిలినా పట్టు విడవక సాగటం, తెలంగాణ వ్యతిరేకులలో ఆందోళనలను పుట్టించి పెంచటం, వారి రకరకాల ఎత్తుగడలను చిత్తు చేయటం, వారెన్ని ప్రలోభాలు పెట్టినా లొంగకపోవటం, ప్రజలు ఎప్పుడైనా నిరుత్సాహ పడితే తిరిగి ఉత్సాహ పరచటం, ఎప్పటికప్పుడు ముందుకు నడిపిస్తూ వారి పట్టుదలను పెంచటం వంటి అనేకానేకం ఉద్యమ నిర్వహణలో భాగమవుతాయి. ఎప్పుడైనా అనుకోని పరిస్థితులు ఎదురైతే వాటినీ చాకచక్యంగా ఎదుర్కోవాలి.

9. ఉద్యమ విజయం. పైన పేర్కొన్నవన్నిటి విషయంలో నాయకత్వం సమర్థవంతంగా చేయటంపైన ఉద్యమ విజయం ఆధారపడి ఉంటుంది. అన్నీ చేసినా ఒక్కోసారి విజయం సమకూరకపోవచ్చు. పరిస్థితుల బట్టి. కాని విజయం కోసం మాత్రం ఈ మార్గాన్ని అనుసరించవలసి ఉంటుంది.

10. పరిపాలన. ఉద్యమ లక్ష్యాలకు అనుగుణంగా పాలన సాగించిన నాయకత్వమే, రాష్ట్రా న్ని అవి నెరవేరి రూపుతీసుకునే విధంగా అభివృద్ధి సంక్షేమాల మార్గంలో తీసుకువెళ్లగలదు. ఆ పని జరిగినట్లు లెక్కలేనన్ని రికార్డులు చెప్తూ, ప్రజలు మాట్లాడుకుంటుండగా ఇప్పుడు 'గ్రోక్' కూడా అదే అభిప్రాయాన్ని ప్రతిధ్వనిస్తున్నది.

11. పార్టీకి ఇప్పుడొక ఎదురుదెబ్బ తగిలింది. నాయకత్వానికి ఒక పరీక్ష ఎదురవుతున్నది. దానిని ఎదుర్కొనేందుకు తనలో, పార్టీలో స్పష్టంగా కనిపిస్తున్న ఆత్మవిశ్వాసంతో, ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణతో, నేర్చుకున్న పాఠాలతో నాయకత్వం సమాయత్తమవుతున్నది. ఒకసారి అది జరిగితే, పార్టీ ఆరంభం నుంచి ఇప్పుడు పునరుజ్జీవన దశ వరకు ఒక వలయం పూర్తయినట్లు. విజయవంతంగా పూర్తయినట్లు. అటువంటి విజయం యావత్తుగా కేసీఆర్ నాయకత్వానిది అవుతుంది. 12.కొత్తతరం నాయకత్వం. ఆ తయారీ భవిష్యత్తుకు సంబంధించినది. ఆ పని ఏ విధంగా జరుగుతున్నదో కనిపిస్తున్నదే. అనేక విషయాలు, సమస్యలు, లక్ష్యాలు, ఉద్యమాలు, నాయకత్వాలు, విజయాల గురిం చి మనం విన్నాము. కాని, మొదటినుంచి చివరివరకు పైన పేర్కొన్న మొత్తం 12 అంశాలనూ కలగలుపుతూ సాగిన నాయకత్వం ఏదీ దృష్టికి రాదు. ప్రత్యేకంగా గుర్తించవలసింది ఏమంటే, కొన్ని సైద్ధాంతిక పార్టీలు, సమష్టి నాయకత్వాలు, లేదా భారత స్వాతంత్ర్యోద్యమంలో వలె దశాబ్దాల పాటు సాగిన యాగంలో ఒక తరం తర్వాత మరొకటిగా వచ్చిన సందర్భాలలో ఈ 12 అంశాలలో కొన్నో, అన్నో కనిపించవచ్చు. కాని కేసీఆర్ విషయంలో, నాయకత్వ స్థాయిలో, ఇది యావత్తూ ఒంటి చేతిపైన జరిగింది. జరుగుతున్నది. ఇదీ ఆయన నాయకత్వం విశ్లేషణ.

# కాలేయ సమస్యలు వేధిస్తున్నాయా..?

# ఈ ఐదు డ్రింక్స్ ఇవాళ్టి నుంచే తాగడండి..!



ప్రస్తుత కాలంలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. కాలేయం సమస్యలకు కేవలం ఆల్కహాల్ మాత్రమే కాదు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో పాటు పలు సమస్యలు సైతం కారణమే. కాలేయ సమస్యలతో బతకడం చాలాకష్టం. ఆరోగ్యంగా ఉండేందుకు ఎప్పటికప్పుడు దాన్ని సహజంగానే డీటాక్స్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం కూడా ముఖ్యమే. అయితే, సాధారణంగా ఆల్కహాల్ మాత్రమే కాలేయం దెబ్బతినడానికి కారణంగా భావిస్తారు. కానీ, వాస్తవానికి బయట వేయించిన జంక్ ఫుడ్‌లను ఎక్కువగా తీసుకుంటే.. మీ కాలేయంలో వ్యర్థాలు సైతం పేరుకుపోతాయి. కాలేయం కొంతవరకు తనను తాను శుభ్రపరచుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. చర్మం దురద, ముదురు మూత్రం, ఎప్పుడూ అలసిపోయినట్లుగా అనిపించడం, వికారం, వాంతులు, కడుపులో నొప్పి.. వాపు, చర్మం పసుపు రంగులోకి మారడం తదితర లక్షణాలు కనిపిస్తే మీరు కాలేయ సమస్యలతో బాధపడుతున్నారని అర్థం. వాటిని విస్మరించడం వల్ల మీరు ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉన్నది.

### పుదీనా టీ..

ప్రకారం.. పుదీనా టీ కాలేయానికి ప్రయోజనకరంగా ఉంటుంది. పుదీనా ఆకుల్లో మెంథాల్, మెంథోన్ వంటి ముఖ్యమైన నూనెలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియకు కూడా సహాయపడతాయి. పుదీనా టీ తయారు చేయడానికి.. ఒక గిన్నెలో నీటిని మరిగించి, కొన్ని పుదీనా ఆకులు కలిపి కలపాలి. దాన్ని కొంతసేపు అలాగే ఉంచి.. రాత్రి పడుకునే అరగంట ముందు తాగాలి.

### పసుపు టీ

పసుపు అనేది ఆయుర్వేదంలో శతాబ్దాలుగా ఉపయోగించే శక్తివంతమైన మసాలా. అలాంటి పరిస్థితిలో ప్రతిరోజూ పసుపు టీ తీసుకోవడంతో శరీరం, కాలేయాన్ని శుభ్రం చేసేందుకు చాలా సహాయపడుతుంది. దీన్ని తయారు చేయడానికి.. ఒక గ్లాసు వేడినీటిలో చిటికెడు పసుపు వేసి తేనె కలిపి తీసుకోవాలి.

### అల్లం నిమ్మకాయ టీ

అల్లం, నిమ్మకాయ మిశ్రమం శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. శరీరాన్ని డీటాక్సిక్ చేయడంతో పాటు బరువు తగ్గించే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఈ మిశ్రమం వాపు నుంచి ఉపశమనం కలిగించడానికి.. జీవక్రియను పెంచడానికి, వ్యాధిని నివారించడానికి సహాయపడుతుంది. దాంతో తయారు చేయడానికి.. ఒక గ్లాస్ వేడినీటిలో సగం నిమ్మకాయ రసం, అల్లం ముక్కను జోడించి కలపాలి. అలాగే, 15 నిమిషాల్లో అలాగే ఉంచి.. వడగట్టి తాగాలి.

### మెంతి నీరు

మెంతి నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. ఇది ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటుంది. ఈ సులభంగా తయారు చేయగల డీటాక్స్ పానీయాన్ని తయారు చేయడానికి, ఒక గ్లాసు వేడినీటిలో ఒక టీస్పూన్ మెంతి పొడిని కలపాలి. దాన్ని 15 నిమిషాలు అలాగే ఉంచాలి. నీటిని ఒక కప్పులో వడకట్టి రోజుకు మూడుసార్లు తాగాలి.

### చమోమిలే టీ

చమోమిలే టీ ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఒత్తిడిని తగ్గించడానికి, నిద్రను మెరుగుపరచడానికి సహాయపడే లక్షణాలు ఉంటాయి. ఇది నాడీ వ్యవస్థను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ఇది వాపు కణజాలాలను శాంతపరుస్తుంది. ఈ టీని తయారు చేసుకునేందుకు ఒక గ్లాసు వేడినీటిలో ఒక టేబుల్ స్పూన్ చమోమిలే పువ్వులను కలపాలి. ఒక 10 నిమిషాలు మూతపెట్టి, ఆపై తాగాలి.

## ఒక ఉద్యోగి వారంలో ఎన్ని గంటలు పనిచేయగలడు

# నిజంగా 90 గంటలు వర్క్ చేస్తే బతుకుతాడా?





ఓ జాతీయ బ్యాంక్‌లో ఉద్యోగం వస్తే ఎంత బాగుంటుంది. పైగా అందులో వెంటవెంటనే పదోన్నతులు వచ్చేస్తే విన్నవాళ్లకి ఈర్ష్య కలిగేంత అదృష్టంగా తోస్తుంది. కానీ పని ఒత్తిడి వల్ల అదే బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకుంటే? ఓ యాభై ఏళ్ల క్రితం వరకట్న హత్యల గురించి వార్తలు వినిపిస్తే, ఇప్పుడు పని ఒత్తిడితో ఇలాంటి మరణాల వార్తలు ఎక్కువవుతున్నాయి. సమాజంలో అంతా సవ్యంగా ఉందని ఎలా అనుకోగలం? చదువుతోనో, మహిళలకు ఉద్యోగ స్వేచ్ఛతోనో మనలో పరిపక్వత వచ్చేసిందని ఎలా సంబరపడగలం? అందుకే మరోసారి వృత్తిగత-వ్యక్తిగత జీవితాల మధ్య సమన్వయం గురించి మాట్లాడుకోవాల్సిందే! లేకపోతే సంస్థలు, వ్యాపారవేత్తల విజయం కోసం పాటుపడే బడుగు జీవులకు ఆ లాభాల్లో వాటా ఎలాగూ దక్కదు సరికదా%ా% సాయంకాలపు షికార్లు, పిల్లల కబుర్లు, ఇష్టమైన పాటలు, అనుబంధాలు, ఆరోగ్యాలూ అన్నీ చేజారిపోతాయి. నష్టాల పేరుతోనో, వ్యవస్థీకరణ అంటూనో అదే సంస్థ చేయి విదిలించిన రోజు తన భవిష్యత్ గడ్డివాములా చిటికెలో కాలిపోవడం కనిపిస్తుంది. 'మీతో ఆదివారాలు కూడా పనిచేయించుకునే అవకాశం లేకపోవడం దురదృష్టం. అయినా ఇంటికి వెళ్లి ఏం చేస్తారు? ఎంతసేపని పెళ్లాం మొహం చూస్తూ కూర్చుంటారు? నేనైతే వారానికి 90 గంటలు పనిచేస్తాను' దేశంలోనే అతిపెద్ద నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కంపెనీ చైర్మన్ అన్నమాటలివి. 'మన సంస్థను తప్ప నా కుటుంబాన్ని పట్టించుకోను. మీరు కూడా పట్టించుకోవడానికి వీల్లేదు. మీ కుటుంబం ఏమైపోయినా నాకు అనవసరం!' ఓ జూమ్ మీటింగ్‌లో ఉన్నతాధికారి ఇచ్చిన తాఖీదు ఇది. పైకి చెప్పకపోవచ్చు, చెప్పినా అవి బయటికి రాకపోవచ్చు. కానీ, చాలా సందర్భాల్లో ఇలాంటి అభిప్రాయాలే యువతరంతో పనిచేయిస్తున్నాయి. అనే సంస్థ 21-30 ఏళ్ల వయస్కుల్లో ఒత్తిడిని నమోదు చేసే ప్రయత్నం చేసింది. ఇందుకోసం అయిదువేల మందిని ప్రశ్నించగా వారిలో 64 శాతం మంది ఉద్యోగంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని చెప్పుకొన్నారు. విచారించదగ్గ విషయం ఏమిటంటే మగవారితో పోలిస్తే, మహిళలు పని వాతావరణంలో మరింత ఒత్తిడికి లోనుకావడం. ఆఫీసుకు వెళ్లినా కూడా ఇల్లు, పిల్లల బాధ్యత కూడా తనదే అనే తీరు ఇందుకు కారణం కావచ్చు. వ్యక్తిగత జీవితాన్ని మాయం చేసేలా ఈ సమస్య ఎందుకు వస్తున్నది? దాని పర్యవసానాలు, పరిష్కారాలు ఓసారి తెలుసుకోవాల్సిందే!

### సమస్య ఇలా!

ఒకచోట తన పాత్ర, బాధ్యత, ప్రవర్తన%ా% మరో వ్యవస్థను ప్రభావితం చేస్తున్నదంటే కచ్చితంగా వృత్తి-కుటుంబాల మధ్య సమన్వయం లోపించినట్టే. కానీ, అసలు సమస్య ఎందుకు వస్తున్నదీ అంటే కొన్ని స్పష్టమైన కారణాలు కనిపిస్తాయి. ఏ పనికి ఎంత సమయం ఇవ్వవచ్చు అనే విశ్లేషణ సంస్థల్లో లేకపోవడం. పై నుంచి వస్తున్న పనిని వచ్చినట్టుగా కొంతమంది ఉద్యోగులతోనే పూర్తి చేయించే ప్రయత్నం. ఉద్యోగిని ఖాళీగా ఉంచకూడదు అనే దృక్పథం. పనిభారం ఎక్కువైనప్పుడు అది ఎంతైనా తట్టుకోవాల్సిందే అనే ఆలోచన. ముందు యంత్రాలు, తర్వాత కంప్యూటర్, తర్వాత కృత్రిమ మేధ ఒక్కో తరంలో ఒక్కో సాంకేతికత పలకరిస్తున్నది. అది వెల్లువలా ముంచెత్తినప్పుడల్లా ఉద్యోగుల మదింపు ఉంటున్నది. వీటికి తోడు కొవిడ్, ఆర్థిక మాంద్యం, యుద్ధం లాంటి సందర్భాల్లోనూ ఉపాధికి కోత ఉంటున్నది. ఈ అనిశ్చితిలో ఉద్యోగాన్ని స్థిరంగా ఉంచుకునేందుకు మరింత శ్రమిస్తున్నారు. కొవిడ్ ముప్పు ఎప్పుడో తొలగిపోయింది. కానీ, అది అలవాటు చేసిన వర్క్ ఫ్రం హోమ్ మాత్రం అలాగే ఉండిపోయింది. పేరుకే ఇంట్లోంచి పని. కానీ అన్నివేళలా అందుబాటులో ఉండాల్సిందే. ఆఖరికి కంపెనీలు తెరుచుకున్నా సరే ఇంటికి వెళ్లాక కూడా పనిచేసే సౌకర్యాన్ని యజమానులు వీలైనంత మేరకు వినియోగించుకుంటున్నారు. ఒకప్పుడు కార్మిక సంఘాలు ఉండేవి. ఉద్యోగుల తరఫున మాట్లాడేవి. సంస్థలో కూడా ఉద్యోగుల మధ్య స్పష్టమైన పని విభజన ఉండేది.

ఇప్పుడు ఈ రెండు కొరవడటంతో ఎవరితో ఏ పనైనా చేయించవచ్చు, అడిగితే ఊరుకునేది లేదు అనే పరిస్థితి కనిపిస్తున్నది. ఎవరు ఎక్కువ పనిచేస్తే వాళ్లే గొప్ప, వ్యక్తిగత జీవితాన్ని ఎంతలా త్యాగం చేస్తే అంత మంచి ఉద్యోగి, ఆఫీసు పూర్తయినా ఆదివారాలైనా అందుబాటులో ఉండేవాడిదే నిబద్ధత అనే తరహా భావనలు పెరిగిపోవడం. సమయానికి వచ్చి, సమయానికి వెళ్లిపోవడాన్ని బద్ధకంగా చూసే దృక్పథం. రోజుకు పది గంటలపాటు అజమాయిషీ చేయడం, పది గంటలపాటు శ్రమించడం రెండూ ఒకటే అనే అపోహలో ఉండే యజమానులు తాము పనిచేస్తున్నాం కాబట్టి ఉద్యోగులు కూడా పనిచేయాలని కోరుకోవడం. ఎంతవరకు పనిచేయాలి, చేయడం కుదరదని ఎప్పుడు చెప్పాలి, కుటుంబాన్ని తేలికగా తీసుకోకుండా వారికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వాలి, ఇంట్లో సమయం గడపడం అంటే కాలక్షేపం కాదు కలిసి ఉండటం లాంటి ఎన్నో అంశాల్లో ఉద్యోగులలో అస్పష్టత, అయోమయం.

### నారాయణ మంత్రం

కొన్ని దశాబ్దాల నుంచి, మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంటికీ, ఆఫీసుకీ మధ్య సరిహద్దులు చెరిగిపోయిన పరిస్థితుల నుంచీ వర్క్-లైఫ్ బ్యాలెన్స్ గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. పనిగంటల ప్రస్తావనా మోగుతున్నది. కానీ, గత ఏడాది ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఈ పనిగంటల గురించి కొన్ని కఠినమైన అభిప్రాయాలు చెప్పినప్పటి నుంచి వేడి రాజుకుంది. ఓ పాడ్‌కాస్టులో మాట్లాడుతూ మూర్తి 'పేదరికాన్ని తప్పించుకోవాలి అంటే కష్టపడి పనిచేయాల్సిందే అని మా తల్లిదండ్రులు నేర్పారు. ఆ మాటను అనుసరిస్తూ నేను 70 గంటల పనివారాన్ని సూచిస్తాను. ఎన్నో ఏళ్లుగా నేను వారానికి 85-90 గంటలు పనిచేస్తూనే వచ్చాను. పొద్దున 6.20 కల్లా ఆఫీసుకు వెళ్లి, రాత్రి 8:30 తర్వాతే బయటికి వచ్చేవాడిని' అన్నారు. ఈ మాటలు తీవ్రమైన చర్చకు, ట్రోలింగ్‌కి దారితీశాయి. తన కెరీర్‌ను నిర్మించుకునే వ్యక్తికీ, ఇతరుల కోసం చాకిరీ చేసే వ్యక్తికీ మధ్య పనిలో ఉండే ఉత్సాహాన్ని, ఆ పని అందించే ఫలితాలను ఈ సూచన పట్టించుకోలేదన్నది అన్నిటికంటే ముఖ్యమైన విమర్శ. సంస్థల్లో తెలియకుండా పెరుగుతున్న పని ఒత్తిడికీ, యాజమాన్యాల అత్యాశకీ, కరిగిపోతున్న కుటుంబ సమయానికీ ఈ మాటలు ప్రతీక అని చాలామంది భావించారు. కానీ నారాయణమూర్తి మాత్రం తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. తన మాటలకు ఎంతోమంది నుంచి అభినందనలు వెల్లువెత్తాయని మురిసిపోయారు. భర్తకు అండగా నిలిచే సుధామూర్తి ఈ వ్యాఖ్యల విషయంలోనూ భర్తను బలపరిచారు. వారానికి 70 గంటలు పనిచేసే అలవాటు తమ కుటుంబం అంతా ఉందని చెప్పారు. కానీ తమ వ్యాఖ్యల పట్ల మధ్యతరగతి కుటుంబాల్లో, సాధారణ ఉద్యోగులలో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని గ్రహించారో అప్పుడు మూర్తి స్వరం మారింది. అది తన వ్యక్తిగత అభిప్రాయం అనీ, ఎన్ని గంటలు పనిచేయాలీ అన్నది ఒకరి పరిస్థితులు, ఇష్టాయిష్టాలను బట్టి ఉంటాయని వాటిని బలవంతంగా ఆపాదించలేమని చెప్పుకొచ్చారు.

### స్పష్టమైన సిద్ధాంతాలు!

పారిశ్రామిక విప్లవం మొదలయ్యాక ఎంత త్వరగా, ఎంత ఎక్కువసేపు పనిచేస్తే అంత వేతనం అన్న తీరు మొదలైంది. 'ఒక మనిషికి ఓ పని అప్పచెప్పి రోజంతా చెయ్యమన్నా చేస్తాడు, పావుగంటలో చేయమన్నా చేస్తాడు. కాబట్టి వీలైనంత తక్కువ సమయంలోనే చేయించుకునే ప్రయత్నం చేయాలి' అనే నమ్మకం బలపడింది. దాంతో పనిగంటలు పెరిగిపోయాయి. వాటిని నియంత్రించేందుకు కార్మిక చట్టాలు వచ్చినా కూడా, వాటి ప్రభావం స్వల్పం. పైగా ఇంటర్నెట్, వర్క్ ఫ్రం హోం లాంటి పరిస్థితుల్లో ఏ పని ఎక్కడి నుంచైనా చేయించుకునే సౌలభ్యం వచ్చింది. ఆఫీసు కాస్తా నేరుగా పడకగదిలోకి దూరిపోయింది. దాంతో వృత్తి-కుటుంబాల మధ్య సమన్వయం గురించి రకరకాల సిద్ధాంతాలు మొదలయ్యాయి. వాటిలో కొన్ని బోర్డర్ థియరీ: కుటుంబం, ఆఫీసు, స్నేహితులు, చుట్టాలు మనిషి ఇలా వేర్వేరు సామాజిక వ్యవస్థలలో ఉంటాడు. వీటిమధ్య కదులుతుంటాడు. వీటిలో ఏ ఒక్క వ్యవస్థ తనను కట్టడి చేసినా, ఇతర వ్యవస్థల్లోకి చొచ్చుకుపోయినా సమస్య తప్పదు. బౌండరీ థియరీ: బోర్డర్ థియరీ పరిమితుల గురించి మాట్లాడితే బౌండరీ థియరీ పాత్రల గురించి చెబుతుంది. ఓ తండ్రిగా, భర్తగా, ఉద్యోగిగా, యజమానిగా, మిత్రుడిగా, బంధువుగా, వినియోగదారుడిగా వేర్వేరు పాత్రలలో ఉండే మనిషి వాటిమధ్య అయోమయానికి గురైతే బంధాలు బీటలువారతాయి. ఉదా? ఉద్యోగిగా వచ్చిన చిరాకును భర్తగా చూపించడం. కాంపెన్సేషన్ థియరీ: ఒక వ్యవస్థలో తనకు సంతృప్తి కలగకపోతే మరో వ్యవస్థలో దానికి పరిహారం పొందే ప్రయత్నం చేస్తామనే సిద్ధాంతమే ఇది. ఇంట్లో సమస్యలు ఉంటే ఆఫీసులో మరింతగా కష్టపడటం, బాస్ సరిగ్గా లేకపోతే బార్‌లో సేదతీరడం ఈ కోవలోకే వస్తాయి. ఇన్‌స్ట్రుమెంటల్ థియరీ: ఒక వ్యవస్థలో సంతోషం కోసం మరో వ్యవస్థలో మరింత తీవ్రంగా పనిచేస్తామని సూచించే సిద్ధాంతం ఇది. ఉదాహరణకు కుటుంబంతో కలిసి సెలవులకు వెళ్లేందుకు కొన్నాళ్లు ఆఫీసులో పడీపడీ పనిచేయవచ్చు. జీతం పెంచుతారనే ఆశతో ఇంటిని పట్టించుకోకపోవచ్చు. ఇవే కాదు స్పిల్ ఓవర్, సెగ్మెంటేషన్, ఫోర్ బర్నర్, ఫెసిలిటేషన్ వ్యక్తిగత-వృత్తిగత సమన్వయాల గురించి చాలా సిద్ధాంతాలే ప్రచారంలో ఉన్నాయి. ఇవన్నీ చెప్పే మాట ఒక్కటే! కారణం ఏదైనా పని, కుటుంబం రెండిటి మధ్య ఉండే విభజన రేఖ చెరిగిపోతే సమస్యలు తప్పవు. కానీ అలా జరిగిందని తెలుసుకునేదెలా? అందుకు పర్యవసానాలేంటి?

### ప్రమాద సూచికలు!

ఉద్యోగపు ఒత్తిడితో ముందు పాడయ్యేది ఆరోగ్యం. రక్తపోటు పెరగడం, కుంగుబాటు, సంతానలేమి, కూర్చుని కూర్చుని మధుమేహం లాంటి సమస్యలు రావడంతో పాటు చిన్నపాటి వైరస్‌ను ఎదుర్కోలేనంతగా రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని తేలింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ పరిశోధనలో వారానికి 55 గంటలకు మించి పనిచేసేవారిలో గుండెపోటు వచ్చే అవకాశం 13 శాతం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. గాలప్ అనే సంస్థ కనీసం 74 శాతం మంది ఉద్యోగులు ఏదో ఒక సమయంలో తట్టుకోలేని ఒత్తిడిని అనుభవిస్తున్నారనీ, ఓ 23 శాతం అయితే ఏకంగా హాస్పిటల్‌లో చేరుతున్నారని తేల్చింది. ఎక్కువ పనిచేయడం వల్ల ఎక్కువ ఉత్పాదకత పెరగడం అనేది భ్రమే అంటున్నారు. విరామం లేకుండా పనిచేయడం వల్ల 'బ్రెయిన్ ఫాగ్' లాంటి సమస్యలతో ఏకాగ్రత లోపిస్తుంది. నిస్సత్తువ, తలనొప్పి, అయోమయం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఒకప్పుడు దశాబ్దాల తరబడి ఒకే సంస్థలో ఉద్యోగాలు చేసేవారు. కానీ, ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ముఖ్య కారణం ఒత్తిడి అని పేర్కొంటున్నారు. ఈ విషయమై 'క్రోనోస్' అనే సంస్థ తలపెట్టిన అభిప్రాయ సేకరణలో 46 శాతం మంది మానవవనరుల అధికారులు ఉద్యోగులు మానేయడానికి ఒత్తిడే ముఖ్య కారణంగా పేర్కొన్నారు. ఈ పరిస్థితి దీర్ఘకాలికంగా అటు యాజమాన్యానికీ, ఇటు ఉద్యోగులకు కూడా నష్టమే కలిగిస్తుంది. గాలప్ సంస్థ చేసిన మరో సర్వేలో కేవలం 21 శాతం మందే తాము చేస్తున్న పనిని ఇష్టపడుతున్నట్టుగా చెప్పారు. మూడోవంతు మంది మాత్రమే వృత్తితోపాటు వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోగలుగుతున్నట్టు ఒప్పుకొన్నారు. చాలామంది ఎక్కువ పని ఒత్తిడితో జీవితమంటేనే విరక్తి చెందుతున్నారు. ఆర్థిక సమస్యలు ఎదురైనా సరే, ఎంత విలువైన ఉద్యోగాన్నయినా సరే తృణప్రాయంగా వదిలేస్తున్నారు. క్వైట్ క్విటింగ్, గ్రేట్ రెజిగ్నేషన్ లాంటి ట్రెండ్స్ ఇందుకు అద్దం పడుతున్నాయి. పనికి మారుపేరుగా నిలిచే జపాన్‌లాంటి దేశాల్లోనే ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తున్నదంటే పనితో జనం ఎంతగా విసిగిపోయారో అర్థం చేసుకోవచ్చు.

### పరిష్కారాలు ఉన్నాయి!

అనుమానం లేదు. కుటుంబం, ఉద్యోగాల మధ్య వైరుధ్యం స్పష్టంగానే ఉంది. కానీ ఇదేమీ పరిష్కారం లేని సమస్య కాదు. పెద్దల దగ్గర నుంచి వ్యక్తిత్వ వికాస నిపుణుల వరకూ చాలామంది చెబుతున్న సూచనల్లో కొన్ని ముఖ్యమైనవి ఇవీ! ఆఫీసు కూడా కుటుంబంలాంటిదే అని చెప్పడం తేలికే. కానీ ఉద్యోగి తన అసలు కుటుంబానికి కూడా కాస్త సమయం కేటాయించేలా సంస్థలే వెసులుబాటు కల్పించాలి. కచ్చితమైన పనివేళలు, నైపుణ్యానికి తగిన పని, శ్రమకు తగిన గుర్తింపు ఇవేవీ అసాధ్యం కాదు. అవసరం కూడా! సంస్థకు ఏం కావాలి, ఉద్యోగి ఏం చేయాలనుకుంటున్నాడు అనే అంశాల మధ్య సమన్వయం సాధిస్తే పని తేలికైనట్టే! మానవవనరుల విభాగం అంటే కేవలం ఉద్యోగులను నియమించే, తొలగించే, సదుపాయాలు కల్పించే వ్యవస్థగానే ఇప్పటికీ ఉంది. అది యజమానికి అనుగుణంగానే పనిచేస్తుందనే అపప్రథ బలపడుతూనే వస్తున్నది. ఉద్యోగులతో వ్యక్తిగతంగా మాట్లాడటం, వారి ఇబ్బందులను తెలుసుకోవడం లాంటి చర్యలు ఉండాలి. అవసరమైతే ఒక మానసిక నిపుణుడు కూడా అందుబాటులో ఉండాలి. సెలవులను వాడుకోవడం ఓ హక్కు. చేస్తున్న పనికి ప్రతిఫలం. కుటుంబంతో గడిపేందుకు, సేదతీరేందుకు అవకాశం. అందుకే చాలా సంస్థలు సెలవులను పూర్తిగా వాడుకోమంటూ ప్రోత్సహిస్తున్నాయి. షిఫ్ట్ డ్యూటీలలో పనిచేసేవారికి ఈ వర్క్-లైఫ్ సమన్వయం మరింత గడ్డుగా మారుతుంది. వీరికి అమలుచేయాలని సూచిస్తున్నారు. వారంలో నాలుగు రోజులు ఎక్కువ గంటలు పనిచేసి, మిగతా మూడు రోజులు సెలవు తీసుకోవడం ఈ విధానానికి ఓ ఉదాహరణ. ఇంట్లో మొబైల్ ఫోన్ల వాడకం శ్రుతిమించడం వల్ల అందులో ఉండే ఆఫీసు పనుల మీద దృష్టి మళ్లుతుందనీ, అలాకాక కాలక్షేపం కోసం ఫోన్ చూసినా కుటుంబంతో గడిపే సమయం మీద ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఇంటి పనిని పంచుకోవడం వల్ల ఆఫీసు ఒత్తిడిని మర్చిపోతారనీ, కుటుంబంతో బంధాన్ని పెంచుకుంటారనీ పరిశోధనలు చెబుతున్నాయి.

వృత్తి నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల ఉద్యోగ భద్రత పెరుగుతుంది. తక్కువ పనివేళలతో ఎక్కువ ప్రభావాన్ని చూపగలుగుతారు. నచ్చిన సంస్థను ఎంపిక చేసుకోగలుగుతారు. ఆఫీసు రాజకీయాలతో పనిలేకుండా రాణించగలుగుతారు. అలాంటివారి వృత్తి-వ్యక్తిగత జీవితాల మధ్య సమన్వయం ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

ఇవి కొన్ని సూచనలు మాత్రమే! సమస్య ఉందీ అని గుర్తించడమే కీలకం. అది స్పష్టమయ్యాక అటు యాజమాన్యాలు, ఇటు ఉద్యోగులు ఏదో ఒక పరిష్కారం కోసం ప్రయత్నించినప్పుడు సవాలక్ష మార్గాలు కనిపిస్తాయి. ఇంట్లో వ్యక్తులు కూడా తమ మధ్యే తిరుగుతూ మధనపడుతున్న ఆ వ్యక్తి బాధను గుర్తించే ప్రయత్నం చేయాలి. 'ఏదో ఆఫీసు గొడవ అయి ఉంటుంది' అని సరిపెట్టుకోకుండా తన బాధను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఇంటికి వచ్చాక ఆఫీస్ మెయిల్స్ చూసుకోవడం, అవసరమైనప్పుడు వాటికి జవాబు ఇవ్వడం చాలా చిన్నవిషయంగా తోచవచ్చు. కానీ అలాంటి పనులు కూడా వ్యక్తిగత జీవితంలోకి చొరబాటే అంటున్నది వర్జీనియా టెక్ వెలువరించిన ఓ పరిశోధన పత్రం.

### సైన్స్ చెబుతున్న కబుర్లు

రోజూ కాసేపు వ్యాయామం చేయడం వల్ల మరింత ఆత్మవిశ్వాసంగా, చురుగ్గా పని చేయగలమనీ%ా% తద్వారా ఉద్యోగపు ప్రభావం వ్యక్తిగత జీవితం మీద ఉండదని ఓ 500 మంది మీద జరిగిన పరిశోధనలో తేలింది. వర్క్-లైఫ్ బ్యాలెన్స్ మనుషుల సమస్య మాత్రమే కాదట. పుట్టిన పిల్లల్నీ, వేటనీ చూసుకోవాల్సిన సింహాలుబీ పెద్ద గుంపు మధ్య ఉండే చీమలకు కూడా ఈ ఇబ్బంది ఉన్నదట. డెస్క్ పక్కన ఓ చిన్న మొక్క పెట్టుకోవడం లేదా పనిచేసేవారికి కనిపించేట్టుగా మొక్కలు ఉంచడం వల్ల పని ఒత్తిడి తగ్గి ఇంటికి దగ్గరగా ఉన్న భావన కలుగుతుందని జపాన్‌లోని హ్యోగో విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధన చెబుతున్నది. పని ఒత్తిడి ఎక్కువగా ఉండేవారు తమ పిల్లల పోషక అవసరాలను సరిగా తీర్చలేకపోతున్నారని 'టెంపుల్ యూనివర్సిటీ' పరిశోధన నిరూపించింది. 3,700 మంది తల్లిదండ్రులను పరిశీలించాక తేల్చిన విషయమిది.

### నాణ్యత ముఖ్యం

వారానికి 70 లేదా 90 గంటలు పనిచేయాలన్న మాట పెద్ద చర్చకే దారితీసింది. ఈ సందర్భంగా కొందరు వ్యాపారవేత్తలు చెప్పిన అభిప్రాయాలు కూడా ఆసక్తికరంగానే ఉన్నాయి.

1 ఎంతసేపు పని చేశాం అన్నది కాదు ఎంత నాణ్యంగా పనిచేశామన్నదే ముఖ్యం. అయినా ఇంట్లో గడపకుండా, స్నేహితులతో మాట్లాడకుండా, పుస్తకాలు చదవకుండా, ఆలోచించడానికే సమయం ఇవ్వకుండా మనం సరైన నిర్ణయాలను ఎలా తీసుకోగలం? (ఆనంద్ మహీంద్ర %-% మహీంద్ర గ్రూప్ చైర్మన్)

2 మన దేశంలో పని సంస్కృతి మారాలి. పై స్థాయిలో వ్యక్తులు కేవలం కబుర్లతోనే ఆగిపోకూడదు. ఆ మాటకు వస్తే ఎక్కువ గంటలు పనిచేయాలనే సిద్ధాంతం వారితోనే మొదలైతే బాగుంటుంది. (రాహుల్ బజాజ్ బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్)

3 నేను వారానికి వంద గంటలు పనిచేసిన రోజులు కూడా ఉన్నాయి. దానివల్ల నా ఆరోగ్యం దెబ్బతిన్నది. ఒత్తిడితో ఏడ్చేదాన్ని. కానీ ఎంత ఎక్కువ పనిచేస్తే అంత ఉత్పాదకత అన్న భ్రమలు తొలగిపోయాయి. ఎంత తెలివిగా, సులువుగా పనిచేస్తామో అంత ఉత్పాదకత వస్తుంది. (రాధిక గుప్త %-% ఎడల్‌వెస్ మ్యూచ్యువల్ ఫండ్ సీఈఓ)

4 అతిగా పనిచేయడం విజయానికి కాదు, అనారోగ్యానికి దారితీస్తుంది. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇవ్వడం అనేది ఓ ఎంపిక కాదు అవసరం. నా దృష్టిలో తెలివిగా పనిచేయడానికీ బానిసలా పనిచేయడానికీ తేడా ఉంది. (హర్ష్ గోయెంకా %-% ఆర్‌పీజీ గ్రూప్ చైర్మన్) పని ఒత్తిడి ఆధునిక జీవితం కోసం చేసిన త్యాగమో, కష్టపడటం వల్ల ఏర్పడే దుష్ప్రభావమో కాదు. దాన్ని ఓ సామాజిక సమస్యగా అందరూ గుర్తించినప్పుడే వ్యక్తికీ, తను చేసే పనికీ, తను భాగస్వామి అయిన సమాజానికి విలువ, సార్థకత!

---

# అది ఎవరు నిద్రాదేవి




'పండుగ అని కూడా లేదు. ఎప్పుడూ నట్టింట్లో నిద్రపోవడమేనా?' మిట్ట మధ్యాహ్నం సోఫాలో పడుకున్న నిశితతో కోపంగా అన్నాడు మిథేశ్. 'నిద్రాదేవి రమ్మన్నప్పుడు రాదు. వచ్చినప్పుడే పడుకోవాలి' అని కసిరింది నిశిత. 'ఈ మధ్య నీ వ్యవహారం ఏమీ బాలేదు' కరుగ్గా అన్నాడు మిథేశ్. 'నేనేం చేశా?' విసుగ్గా అంది నిశిత. 'సాయంత్రం మీ అమ్మవాళ్ల ఇంటికి వెళ్లి.. అక్కడే దీనిపై మాట్లాడదాం' అంటూ రూమ్‌లోకి వెళ్లి డోర్ వేసుకొన్నాడు మిథేశ్. గంట గడిచింది మిథేశ్ గదిలోంచి వణుకుతూ బయటికి వచ్చిన వంట మనిషి రాము మెట్లు దిగుతూ.. 'అమ్మగారూ.. మన మిథేశ్ బాబును ఎవరో చంపేశారు' అంటూ కేకేశాడు. దీంతో మిగతా ఇద్దరు పనివాళ్లు పరుగెత్తుకొచ్చారు. రాము అరుపులకు వెంటనే నిద్ర మేల్కొన్న నిశిత.. గదిలోకి పరిగెత్తింది. రక్తపు మడుగులో మిథేశ్ పడి ఉన్నాడు. అది చూసి హతాశురాలైంది నిశిత. అరగంటలో క్రైమ్ స్పాట్‌కు రుద్ర అండ్ టీమ్ చేరుకున్నారు. ఏం జరిగిందంటూ అందర్నీ ప్రశ్నించడం మొదలుపెట్టారు. 'ఇంట్లో మొత్తం ఎంతమంది?' నిశితను ప్రశ్నించాడు రుద్ర. 'మిథేశ్, నేను ఇంకో ముగ్గురు పనివాళ్లు' సమాధానం ఇచ్చింది. 'ఇద్దరికి ముగ్గురు పనివాళ్లా?' ఆశ్చర్యపోయాడు హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి. 'మా ఇల్లు చాలా పెద్దది సార్. ఇద్దరం ఉద్యోగులమే! ఇంటిని చక్కబెట్టేవాళ్లు, వంట చేసేవాళ్లు.. ఇలా ఉండాలిగా' బదులిచ్చింది నిశిత. 'ముందుగా హత్యను ఎవరు చూశారు?' అడిగాడు రుద్ర. రాము వైపు చేయి చూపించింది నిశిత. 'నీ పేరేంటి?' ప్రశ్నించాడు రుద్ర. 'రాము సార్!' అన్నాడు.. 'ఏం చేస్తావ్?' మళ్లీ ప్రశ్నించాడు రుద్ర. 'వంటవాణ్ని సార్' అన్నాడు. 'హత్య జరిగిన సమయంలో ఏం చేస్తున్నావ్?' అని ప్రశ్నించాడు. 'సార్‌కు బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేసి గదిలోకి తీసుకెళ్లా సార్.. ఇంతలో ఆయన రక్తపు మడుగులో ఉండటం చూసి భయపడిపోయా. వెంటనే కిందికి వచ్చి అమ్మగారికి చెప్పా' వణికిపోతూనే చెబుతూ ఒక్కసారిగా స్పృహకోల్పోయాడు రాము. వెంటనే అతణ్ని పక్కకు తీసుకెళ్లిన సిబ్బంది.. కాస్త మజ్జిగ అందించారు. మిథేశ్ సిటీలో ఓ పాపులర్ ఆంత్రప్రెన్యూర్ కావడంతో హత్య విషయం దుమారం రేపింది. మిథేశ్ ఇంటి చుట్టూ మీడియా ప్రతినిధులు గుమిగూడారు. అక్కడ అంతా గందరగోళంగా ఉంది. ఇదే సమయంలో అక్కడే ఉన్న పనివాళ్లు రుద్ర దగ్గరికి వచ్చారు. 'సార్.. మేం ఇంటికి వెళ్తాం' అన్నారు. 'ఎందుకు.. అంత అర్జెంట్??' ప్రశ్నించాడు రుద్ర. ఇద్దరూ మిన్నకుండిపోయారు. ఇంటికి వెళ్తామన్న ఇద్దరు పనివాళ్లు దంపతులు. భర్త సుబ్బయ్య తోటమాలిగా పనిచేస్తే.. భార్య శాంతమ్మ ఇంటిని చక్కబెడుతుంది. 'మేడమ్.. మీ భర్త హత్య జరిగిన సమయం సుమారు ఒంటిగంట. అప్పుడు మీరు ఏం చేస్తున్నారు?' నిశితను అడిగాడు రుద్ర. 'మధ్యాహ్నం నాకు నిద్రపోవడం అలవాటు. దీంతో నేను హాల్‌లో పడుకొన్నాను. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికొచ్చిన మిథేశ్.. నాతో ఇదే విషయమై చిన్న గొడవపడ్డాడు. తర్వాత రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకొన్నాడు. ఇలాంటి గొడవలు మాకు ఎప్పుడూ ఉండేవే. దీంతో నేనూ పడుకొన్నాను. గంట-గంటన్నర తర్వాత రాము పరుగెత్తుకొంటూ వచ్చి నన్ను నిద్రలేపాడు. అయ్యగారు చనిపోయారంటూ బోరుమన్నాడ'ని చెప్పుతూపోయింది నిశిత. 'మీకు ఎవరైనా శత్రువులు ఉన్నారా?' అని రుద్ర అడిగిన ప్రశ్నకు లేరంటూ తలూపింది నిశిత. 'పనివాళ్లు ఎంతకాలంగా ఇక్కడ పనిచేస్తున్నారు?' అడిగాడు. సుమారు ఐదేండ్లుగా అంటూ బదులిచ్చింది. వాళ్లను కూడా ఇంటరాగేషన్ చేయడానికి రుద్ర వెళ్తుండగా.. 'సార్.. వాళ్ల మీద నాకు ఎలాంటి అనుమానం లేదు. ఎందుకంటే ఒంటిగంట సమయంలో శాంతమ్మ స్టోర్ రూమ్‌లో పాత సామాను సర్దుతున్నది. సుబ్బయ్య మొక్కల పని చూస్తున్నాడు' చెప్పింది నిశిత. 'మరి.. రాము?' సూటిగా ప్రశ్నించాడు రుద్ర. 'వాడు.. వంట వండుతున్నాడు' బదులిచ్చింది. నిశిత చెప్పింది నిజమేనన్నట్టు పనివాళ్లు ఇద్దరు తలూపారు. ఇంతలో రాముకు మెలకువ వచ్చింది. హత్య జరిగిన సమయంలో ఏం చేస్తున్నావంటూ అప్పుడే లేచిన రామును రుద్ర ప్రశ్నించాడు. వంట చేస్తున్నట్టు బదులిచ్చాడు. గదిలో ఎలాంటి క్లూస్ దొరకలేదని ఫోరెన్సిక్ టీమ్ చెప్పింది. 'సార్.. ఇది హై ప్రొఫైల్ కేసు. త్వరగా సాల్వ్ చేయాలి' అంటూ రామస్వామి అంటుండగానే.. 'ఇది హైప్రొఫైల్ కేసు.. నిజమే బాబాయ్.. అయితే, లో ఐక్యూతో నేరస్తులు ఇంత త్వరగా దొరుకుతారని అనుకోలేదు' అంటూ రుద్ర నవ్వాడు. ఏమీ అర్థం కాలేదన్నట్టు రామస్వామి విస్తుపోయాడు. ఇంతలో లేడీ కానిస్టేబుల్ నిశితను తమదైన శైలితో విచారించడంతో అసలు విషయాన్ని మొత్తం చెప్పేసింది. అంతకుముందే రాముకు కూడా ఇదే ట్రీట్‌మెంట్ ఇవ్వడంతో.. నిశిత, తాను కలిసే మిథేశ్‌ను హత్య చేసినట్టు ఒప్పేసుకొన్నాడు. ఇంతకీ, మిథేశ్‌ను నిశిత-రాము కలిసి హత్య చేశారని రుద్ర ఎలా కనిపెట్టినట్టు?

### అది ఎవరు?

మిథేశ్ హత్య జరిగిన సమయం మధ్యాహ్నం ఒంటిగంట. ఆ సమయంలో ఎవరైనా లంచ్ చేస్తారు. అయితే, మిథేశ్‌కు బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వడానికి వెళ్లానని రాము అబద్ధం చెప్పి రుద్రకు అనుమానం కలిగించాడు. మరోవైపు, మిథేశ్ హత్య జరిగిన సమయంలో తాను పడుకొన్నానని, రాము వచ్చి పిలిస్తేనే తనకు మెలకువ వచ్చిందన్న నిశిత.. హత్య సమయంలో పనిమనుషులు ఎవరేం చేస్తున్నారో కరెక్ట్‌గా చెప్పింది. అంటే, ఆమె నిద్రపోవడం అబద్ధమని తేలింది. కాగా, భార్య-భర్తలైన పనివాళ్లు సుబ్బయ్యకు, శాంతమ్మకు అనుమానం రాకుండా రాము, నిశిత కలిసే ఈ హత్య చేశారని, రాముతో తనకున్న అక్రమ సంబంధాన్ని కనిపెట్టిన మిథేశ్ ఎక్కడ దాన్ని బయటపెడతాడోనన్న భయంతో నిశిత ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు విచారణలో తేలింది.

---

## ఈ రెండు ఇన్ఫెక్షన్లు క్యాన్సర్‌కు ప్రధాన కారణం కావచ్చు



క్యాన్సర్ ఒక ప్రమాదకరమైన, తీవ్రమైన వ్యాధి, ఇది శరీరంలోని ఏ భాగంలోనైనా సంభవించవచ్చు. దీనికి సకాలంలో చికిత్స చేయకపోతే, అది మరణానికి కూడా దారితీయవచ్చు. దీని కారణంగా, రోగులు ప్రాణాలు కూడా కోల్పోవచ్చు. అటువంటి ప్రమాదాలను తగ్గించడానికి, మీరు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్ మొదటి దశలో ఉన్నప్పుడు, దాని ప్రారంభ పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చు. ఈ రోజు మనం క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అటువంటి ఇన్ఫెక్షన్ల గురించి తెలుసుకుందాం..

### హెపటైటిస్ బి, సి వైరస్లు

హెపటైటిస్ బి, సి వైరస్‌లు కాలేయ క్యాన్సర్‌కు కారణమయ్యే దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్‌లు. ఈ వైరస్‌లు రక్తం, లైంగిక సంబంధం ద్వారా లేదా తల్లి నుండి బిడ్డకు వ్యాపిస్తాయి. హెపటైటిస్ నివారించడానికి మొదటి క్యాన్సర్ వ్యాక్సిన్ 1985 లో ప్రవేశపెట్టారు. హ్యూమన్ పాపిల్లోమావైరస్ ఈ వైరస్ గర్భాశయ క్యాన్సర్‌తో ముడిపడి ఉంది. ఈ బ్యాక్టీరియా కడుపు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.

### గర్భాశయ సంక్రమణ

గర్భాశయ ఇన్ఫెక్షన్ విషయంలో సరైన చికిత్స చాలా ముఖ్యం. ఇది వేగంగా కోలుకోవడానికి సహాయపడుతుంది. ఇది తీవ్రమైన రూపాన్ని తీసుకోకుండా సమయానికి ఆపడం చాలా ముఖ్యం. గర్భాశయ సంక్రమణకు సకాలంలో చికిత్స చేయకపోతే, మహిళలు సంతానోత్పత్తి సంబంధిత సమస్యలను ఎదుర్కొంటారు. గర్భాశయ ఇన్ఫెక్షన్ కారణంగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. గర్భాశయ ఇన్ఫెక్షన్ కారణంగా గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

### మానవ పాపిల్లోమావైరస్

హ్యూమన్ పాపిల్లోమా వైరస్ అనేది ఒక రకమైన ఇన్ఫెక్షన్, ఇది తరచుగా లైంగిక సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది. వైరస్ కణాలలో మార్పులకు కారణమవుతుంది. దీనివల్ల ఈ క్యాన్సర్ కణాలు అదుపు లేకుండా పెరుగుతాయి. ఒక వ్యక్తి శరీరంలో రోగనిరోధక శక్తి బలహీనమైనప్పుడు ఇది జరుగుతుంది. ఆపై శరీరం ఇకపై వైరస్‌తో పోరాడలేకపోతుంది. ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు ఆంధ్రజ్యోతి బాధ్యత వహించదు.)

# చిన్న షేర్లు.. పెద్ద లాభాలు.. 2024-25లో రిటైల్ ఇన్వెస్టర్లకు జోష్

**8 శాతం ఎగిసిన బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ**

**6 శాతం పుంజుకున్న మిడ్‌క్యాప్ ఇండెక్స్**

**5 శాతం వృద్ధితో సరిపెట్టుకున్న సెన్సెక్స్**



సోమవారం (మార్చి 31)తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో మదుపరులకు చిన్న షేర్లు పెద్ద లాభాలనే పంచిపెట్టాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు పరుగులు పెట్టాయి మరి. రిటైల్ ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున పెట్టుబడులకు దిగడంతో చిన్న, మధ్యశ్రేణి స్టాక్స్ విలువ అమాంతం పెరిగిపోయింది. ఈ క్రమంలోనే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3,471.79 పాయింట్లు లేదా 8 శాతం పుంజుకున్నది. మిడ్‌క్యాప్ సూచీ సైతం 2,209 పాయింట్లు లేదా 5.61 శాతం ఎగిసింది. ఇదే సమయంలో బీఎస్ఈ లార్జ్‌క్యాప్ సూచీ సెన్సెక్స్ మాత్రం 5.10 శాతం మేరకే పెరిగింది. గడిచిన ఏడాది కాలంలో 3,763.57 పాయింట్లు అందిపుచ్చుకున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

### ఆఖర్లో ఉత్సాహంగా..

మార్చి నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. అంతకుముందు వరుసగా 5 నెలల (అక్టోబర్-ఫిబ్రవరి)పాటు సూచీలు పతనమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మార్చి నెల ఇన్వెస్టర్లు సెల్లింగ్ ప్రెషర్ నుంచి బయ్యింగ్ మోడ్‌లోకి రావడం మార్కెట్ సెంటిమెంట్‌ను ఎంతగానో పెంచిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ ఒక్క నెలలోనే సెన్సెక్స్ 4,216.82 పాయింట్లు లేదా 5.76 శాతం పెరగడం గమనార్హం. అలాగే స్మాల్‌క్యాప్ 3,555.23 పాయింట్లు లేదా 8.25 శాతం, మిడ్‌క్యాప్ 2,939.10 పాయింట్లు లేదా 7.61 శాతం ఎగబాకాయి. ఫలితంగా అప్పటిదాకా వాటిల్లిన నష్టాలు కనుమరుగైపోయాయి. నిజానికి విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతున్నా.. దేశీయ సంస్థాగత మదుపరుల (డీఐఐ)తోపాటు, రిటైల్ ఇన్వెస్టర్లు అండగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఈక్విటీలు ఆకర్షణీయ ప్రదర్శననే కనబర్చగలిగాయి. అయితే మార్చి ద్వితీయార్థంలో ఎఫ్ఐఐలు కూడా తిరిగి పెట్టుబడులపట్ల ఆసక్తి కనబర్చడం, ఈక్విటీల్లోకి నిధుల వరదను పారించడం కూడా కలిసొచ్చిందని నిపుణులు మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు.

### ఆల్‌టైమ్ హైలో..

2024-25 ఆర్థిక సంవత్సరంలో బీఎస్ఈ లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలన్నీ ఆల్‌టైమ్ హై రికార్డులను నమోదు చేశాయి. లార్జ్‌క్యాప్ ఇండెక్స్ సెన్సెక్స్ నిరుడు సెప్టెంబర్ 27న మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారి 85, 978.25 పాయింట్లను తాకింది. ఇక సెప్టెంబర్ 24న మిడ్‌క్యాప్ సూచీ 49,701. 15 పాయింట్ల గరిష్ఠాన్ని అందుకున్నది. డిసెంబర్ 12న స్మాల్‌క్యాప్ సూచీ 57,827.69 పాయింట్లను చేరింది. ఇక బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో గత ఏడాది సెప్టెంబర్‌లోనే రూ.478 లక్షల కోట్లకు వెళ్లింది. అయితే అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రావడం, పరస్పర సుంకాల హెచ్చరికలు చేయడం.. భారత్‌సహా ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది. దీంతో తర్వాతి రోజుల్లో పరుగులకు బ్రేక్ పడ్డట్టైంది. కాగా, 2023-24లో బీఎస్ఈ సెన్సెక్స్ 14,659. 83 పాయింట్లు లేదా 24.85 శాతం, మిడ్‌క్యాప్ 15,013.95 పాయింట్లు లేదా 62.38 శాతం, స్మాల్‌క్యాప్ 16,068.99 పాయింట్లు లేదా 59.60 శాతం పెరిగాయి.

# ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి కొత్త రూల్స్..
# క్రెడిట్ కార్డుల నుంచి ఇన్‌కం ట్యాక్స్ వరకు మారేవి ఇవే..!




మార్చి నెల నేటితో ముగియనున్నది. రేపటి నుంచి ఏప్రిల్ మాసం మొదలవనున్నాయి. ప్రతి నెలా కొత్తగా రూల్స్ అమలులోకి వస్తుంటాయి. ఈ ఏప్రిల్ ఒకటి నుంచి సైతం బ్యాంకుల్లో మినిమం బ్యాలెన్స్, యూపీఐ రూల్స్, గ్యాస్ ధరల్లో మార్పులు సహా కొన్ని నిబంధనలు మారబోతున్నాయి. దాంతో జనాల జేబుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఏప్రిల్ ఒకటి నుంచి మారనున్న రూల్స్ ఏంటో ఒకసారి తెలుసుకుందాం రండి..!

### కొత్త ఆదాయపు పన్ను నియమాలలో మార్పులు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ 2025 ప్రసంగంలో కొత్త పన్ను స్లాబ్‌లు, రేటు మార్పులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సవరించిన ఆదాయపు పన్ను నియమాలు ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. కొత్త ఆదాయపు పన్ను నియమాల ప్రకారం.. సంవత్సరానికి రూ.12 లక్షల వరకు సంపాదించే వ్యక్తులు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. జీతం పొందే వ్యక్తులు రూ.75వేల ప్రామాణిక మినహాయింపు ప్రయోజనాన్ని పొందుతారు. దాంతో రూ.12.75 లక్షల వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు.

### యూపీఐ రూల్స్ సైతం..

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ భద్రతను పెంచడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. చాలాకాలంగా పని చేయని బ్యాంకుల యూపీఐ లావాదేవీలను మూసివేయనున్నారు. యూపీఐకి లింక్ చేయబడిన డియాక్టివేట్ అయిన వాటిని దశలవారీగా తొలగించేందుకు ఎన్‌పీసీఐ బ్యాంకులు, ఫోన్‌పే, గూగుల్ పే వంటి యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదేశించింది. యూపీఐకి లింక్ చేసిన మొబైల్ నంబర్ చాలాకాలంగా ఉపయోగించకపోయినట్లయితే ఏప్రిల్ నుంచి నిలిచిపోయే అవకాశం ఉంటుంది.

### క్రెడిట్ కార్డు రూల్స్‌లోనూ మార్పులు..

ఏప్రిల్ నుంచి క్రెడిట్ కార్డులకు సంబంధించి రూల్స్ సైతం మారనున్నాయి. పలు బ్యాంకులు ఆయా కార్డుల రివార్డ్ పాయింట్లలో కోత విధించిన విషయం తెలిసిందే. ఎస్‌బీఐ సింప్లిక్లిక్, ఎయిర్ ఇండియా ఎస్‌బీఐ ప్లాటినం కార్డ్ రివార్డు పాయింట్ల రూల్స్ మారాయి. ఎయిర్ ఇండియాతో ఎయిర్‌లైన్ విలీనం తర్వాత యాక్సిస్ బ్యాంక్, విస్తారా క్రెడిట్ కార్డ్ ప్రయోజనాలను సవరిస్తున్నది. ఇవి కొత్త ఆర్థిక సంవత్సరంలో అమల్లోకి వస్తాయి.

### ఏకీకృత పెన్షన్ పథకం

ఆగస్టు 2024లో ప్రభుత్వం ప్రారంభించిన ఏకీకృత పెన్షన్ పథకం పాత పెన్షన్ పథకాన్ని భర్తీ చేస్తుంది. ఇది ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుంది. కొత్త పెన్షన్ పథకానికి సంబంధించిన రూల్స్ మార్పు దాదాపు 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను ప్రభావితం చేయనున్నది. దీని కింద కనీసం 25 సంవత్సరాల సర్వీస్ ఉన్న ఉద్యోగులు గత 12 నెలల సగటు ప్రైమరీ సాలరీలో 50 శాతానికి సమానమైన పెన్షన్ పొందుతారు.

### జీఎస్టీ రూల్స్.. మల్టీ ఫాక్టర్ అథెంటికేషన్

ఏప్రిల్ ఒకటి నుంచి జీఎస్టీ రూల్స్ సైతం మారనున్నాయి. పన్ను చెల్లింపుదారుల కోసం సేవల పన్ను పోర్టల్‌లో ఇప్పుడు మల్టీ-ఫాక్టర్ అథెంటికేషన్ ఉంటుంది. ఇది పన్ను చెల్లింపుదారుల భద్రతను మెరుగుపరిచేందుకు ఎంఎఫ్ఏని తీసుకువచ్చింది. 180 రోజుల కంటే ఎక్కువ పాతది కాని ఆధార్ పత్రాలకు మాత్రమే ఈ-వేబిల్లులు రూపొందిస్తారు. దాంతో పాటు, వస్తువులు, సేవల పన్ను నెట్‌వర్క్ వ్యాపారాల కోసం ఈ-ఇన్‌వాయిసింగ్ ప్రక్రియలోనూ మార్పులు చేస్తున్నది. ఏప్రిల్ 1 నుండి రూ.10 కోట్ల కంటే ఎక్కువ.. రూ.100 కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉన్న వ్యాపారాలు ఇన్‌వాయిస్ జారీ చేసిన తేదీ నుంచి 30 రోజుల్లోపు ఇన్‌వాయిస్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో ఈ-ఇన్‌వాయిస్‌లను అప్‌లోడ్ చేయాలి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.100 కోట్లు.. అంతకంటే ఎక్కువ ఉన్న వ్యాపారాలకు మాత్రమే వర్తిస్తుంది.

### బ్యాంకుల్లో మినిమం బ్యాలెన్స్..

బ్యాంకులు సైతం మినిమం బ్యాలెన్స్ రూల్‌ని మారుస్తున్నాయి. వాస్తవానికి ఖాతా ఉన్న ప్రాంతాన్ని బట్టి కనీస బ్యాలెన్స్‌ని అమలు చేస్తున్నాయి. ప్రాంతాల్లో అధికంగా బ్యాలెన్స్ కాగా.. సెమీ-అర్బన్ ఈ ప్రాంతాలలో మితమైన కనీస బ్యాలెన్స్ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ కనీస బ్యాలెన్స్ ఉండాలనే నిబంధనలు అమలు కానున్నాయి. కనీస బ్యాలెన్స్ ఖాతాలో ఉంచకపోతే.. జరిమానా చెల్లించే అవకాశం రానున్నది. ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌తో పాటు పలు బ్యాంకులు ఏప్రిల్ ఒకటి నుంచి కనీస బ్యాలెన్స్ రూల్స్‌లో మార్పులు చేయనున్నాయి.

### గ్యాస్ ధరలు..

ప్రతి నెలా చమురు కంపెనీలు గ్యాస్ ధరలను సవరిస్తుంటాయి. ఈ సారి కూడా ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉన్నది. డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్ ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. మార్చిలోనూ పెట్రోలియం కంపెనీలు ధరలను సవరించిన విషయం తెలిసిందే. దాంతో కమర్షియల్ సిలిండర్ ధర స్వల్పంగా పెరిగింది. సిలిండర్‌కు రూ.6 పెరిగింది. ఫిబ్రవరిలోనూ కంపెనీలు రూ.7 వరకు పెంచాయి.

# గోల్డ్ నిఫ్టీ50.. దీర్ఘకాల పెట్టుబడికి ఏది ఉత్తమం?

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ర్యాలీ బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలకు గొప్ప లాభాలనే అందించింది. ఒక్క వారంలోనే సుమారుగా సెన్సెక్స్ 4.35 శాతం, నిఫ్టీ 4.45 శాతం చొప్పున ఎగిశాయి మరి. అయితే ఇన్వెస్టర్స్ పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులను ఎంచుకోవడానికి లేదా పెంచుకోవడానికి ఇది చాలదు. ఎందుకంటే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా అంటే జనవరి-మార్చిలో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఇంచుమించుగా 1 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం, వెండి ధరలు దాదాపు 17 శాతం, 15 శాతం మేర పెరిగాయి. ఇంకా లోతుగా చెప్పాలంటే జనవరి 1న సెన్సెక్స్ 78,139.01 పాయింట్ల వద్ద మొదలైంది. ఇప్పుడిది 77,414.92 పాయింట్ల వద్ద ఉన్నది. అలాగే నిఫ్టీ 23,644.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. ఫలితంగా సెన్సెక్స్ 724.09 పాయింట్లు, నిఫ్టీ 125.45 పాయింట్లు కోల్పోయినట్టైంది. కానీ బంగారం ధర రూ.78,950 నుంచి రూ.92,150కి ఎగబాకింది. వెండి ధర రూ.89,700 నుంచి రూ.1,03,000లకు చేరింది. దీంతో గోల్డ్, సిల్వర్ రేట్లు గడిచిన 3 నెలల్లో రూ.13,200, రూ.13,300 చొప్పున ఎగిసినట్టైంది.

### ఇదీ సంగతి..

పైన చెప్పుకున్న లెక్కలన్నీ స్వల్పకాలిక పెట్టుబడి ఆధారిత గణాంకాలే. కానీ మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది దీర్ఘకాలిక పెట్టుబడికి ఏది ఉత్తమం? అన్నదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలు.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. దీంతో మెజారిటీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ



పరిణామాలు స్టాక్ మార్కెట్ సూచీలను దిగువకు, గోల్డ్, సిల్వర్ సూచీలను ఎగువకు పంపాయి. ఇక భారత్ విషయానికొస్తే.. బంగారాన్ని సురక్షిత మదుపు సాధనంగా భావిస్తుంటే, బ్రాడర్ ఈక్విటీ మార్కెట్‌కు, దేశ ఆర్థిక ప్రగతికి నిఫ్టీనే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి మదుపరుల పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్ అనేవి ఇక్కడ కీలకం అని గుర్తుంచుకోవాలి. వాటి ప్రకారం..

### దీర్ఘకాల రాబడులు

గడిచిన రెండు దశాబ్దాల్లో దేశీయంగా మదుపరులకు బంగారంపై పెట్టుబడులు 8-10 శాతం మేర చక్ర వార్షిక వృద్ధిరేటును అందించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ పసిడిపై మదుపు ఆకర్షణీయ ప్రదర్శననే ఇచ్చింది. అయితే దీర్ఘకాలంలో నిఫ్టీలో పెట్టుబడులు 12-15 శాతం వరకు చక్ర వార్షిక వృద్ధిరేటును చూపాయి. దీంతో వృద్ధికే మీ ప్రాధాన్యత అయితే నిఫ్టీ పెట్టుబడులే లాభదాయకం.

### ద్రవ్యోల్బణం సవాళ్లు

ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలంటే బంగారం చక్కని సాధనం. కరెన్సీ విలువ తగ్గితే ఇది పెరుగుతుంది. ఇక స్టాక్ మార్కెట్లు సైతం ద్రవ్యోల్బణాన్ని మించి పరుగులు పెడుతున్నాయి. కంపెనీల లాభాలు, ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో నిఫ్టీదే పైచేయి.

### ఒడిదుడుకులు

పుత్తడి ధరల్లో ఒడిదుడుకులు తక్కువే. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభాల ప్రభావం పెద్దగా ఉండదు. స్టాక్ మార్కెట్లపై ప్రతీ చిన్నదాని ప్రభావం కనిపిస్తుంది. అయినా త్వరగా కోలుకుంటాయి. స్థిరత్వాన్ని కోరుకునే మదుపరులకు బంగారమే ఉత్తమం. అయితే ఒడిదుడుకులను తట్టుకుని, ఓపిగ్గా ఎదురుచూస్తే నిఫ్టీ లాభం.

### ద్రవ్య లభ్యత

భౌతిక బంగారాన్ని నగదుగా మార్చుకోవడం కొంత ఇబ్బంది. నాణ్యత, తయారీ ఇతరత్రా ఖర్చులు ఎదురవుతాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈ సమస్య ఉండదు. స్టాక్ మార్కెట్లలో షేర్ల క్రయవిక్రయాలు సులభం. నగదు లభ్యత వేగంగానే ఉంటుంది. కాబట్టి పసిడి కంటే నిఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్స్‌నే త్వరగా క్యాష్ చేసుకోవచ్చు.

### పోర్ట్‌ఫోలియోజి

బంగారం ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గిస్తుంది. కానీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. అయితే దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలే సరైనవని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ మాట.

### చివరగా..

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి తమ పోర్ట్‌ఫోలియోల్లో స్థిరత్వాన్ని కోరుకునే భారతీయ మదుపరులకు బంగారంపై పెట్టుబడులే ఉత్తమం. అయితే పోర్ట్‌ఫోలియోల్లో వేగవంతమైన వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీలే నయం. అయితే నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత లాభదాయకం.

# కుప్పకూలిన భారత స్టాక్ మార్కెట్లు.. 1300 పాయింట్లు పతనమైన సెన్సెక్స్..



కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజునే దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా సుంకాల ఆందోళనలతో సెంటిమెంట్ దిబ్బతిన్నది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున మార్కెట్లు పతనమవుతున్నాయి. ఈద్ సందర్భంగా సోమవారం మార్కెట్లు పని చేయని విషయం తెలిసిందే. మంగళవారం మార్కెట్లు నష్టాలతోనే మొదలయ్యాయి. ప్రారంభంలోనే సెన్సెక్స్ 639.13 పాయింట్లు తగ్గి.. 76,775.79 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సైతం 180.25 పాయింట్లు తగ్గి 23,339.10 పాయింట్లకు చేరింది. ప్రస్తుతం సెన్సెక్స్ 1265.12 పాయింట్లు తగ్గి.. 76149.80 పాయింట్ల వద్ద ట్రేడవుతున్నది. ఇక నిఫ్టీ 322.65 పాయింట్లు తగ్గి.. 23,196.70 పాయింట్ల వద్ద కొనసాగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతికార టారిఫ్‌లపై బుధవారం తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అదే సమయంలో ఇన్ఫోసిస్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ షేర్ల అమ్మకాలతో మార్కెట్‌పై మరింత ఒత్తిడి పెరిగింది. ఇక చమురు ధర పెరగడం కూడా ఓ కారణం. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.51 శాతం పెరిగి 74.74 డాలర్లకు చేరుకుంది. భారత్ చమురు దిగుమతులపై ఆధారపతుండడగా.. చమురు ధరల పెరుగుదల మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దానికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. శుక్రవారం రూ.4352.82 కోట్ల విలువ షేర్లను విక్రయించారు. ఇక ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో ఆర్థిక మాంద్యం ప్రభావం పడే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఈ క్రమంలో పెట్టుబడిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం మార్కెట్‌లో బజాజ్ ఫైనాన్స్ సర్వీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, హిందాల్కో, హెచ్‌సీఎల్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, శ్రీరామ్ ఫైనాన్స్, టీసీఎస్ నష్టాల్లో కొనసాగుతుండగా.. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సిప్లా, డాక్టర్ రెడ్డీస్, బజాజ్ ఆటో, ఓఎన్‌జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాల్లో కొనసాగుతున్నాయి.

# వొడాఫోన్ ఐడియాలో భారీగా పెరగనున్న కేంద్రం వాటా..!



దేశానికి చెందిన ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా లో వాటా పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కంపెనీ బకాయిపడిన స్పెక్ట్రమ్ వేలం మొత్తాన్ని తన వాటాగా మార్చుకోనున్నది. స్పెక్ట్రమ్ వేలం బకాయిలకు బదులుగా వొడాఫోన్ ఐడియాలో వాటా తీసుకునేందుకు కేంద్రం అంగీకరించిందని.. రూ..36,950 కోట్ల విలువైన షేర్లను కొత్తగా కొనుగోలు చేయాలని నిర్ణయించుకుందని ఆదివారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ పేర్కొంది. అప్పుల్లో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియాలో 22.6 శాతం వాటాతో కేంద్రం అతిపెద్ద వాటాదారుగా ఉన్నది. కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ సెప్టెంబర్ 2021 సంస్కరణ, టెలికాం రంగానికి సపోర్ట్ ప్యాకేజీకి అనుగుణంగా తాత్కాలిక నిషేధం ముగిసిన తర్వాత తిరిగి చెల్లించాల్సిన వాయిదా వేసిన బకాయిలతో సహా స్పెక్ట్రమ్ వేలం బకాయిలను భారత ప్రభుత్వానికి జారీ చేసే ఈక్విటీ షేర్లుగా మార్చాలని నిర్ణయించింది. ఈక్విటీ షేర్లుగా మార్చాల్సిన మొత్తం రూ.36,950 కోట్లు అని ఫైలింగ్‌లో పేర్కొంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియాతో సహా సంబంధిత అధికారుల నుంచి అవసరమైన ఆర్డర్ జారీ చేసిన తర్వాత 30 రోజుల్లోపు రూ.10 ముఖ విలువ కలిగిన రూ.3,695 కోట్ల ఈక్విటీ షేర్లను రూ.10 ఇష్యూ ధరకు జారీ చేయాలని వోడాఫోన్ ఐడియా (%ఎ×ూ%) ఆదేశించినట్లు తెలిపింది. ఈక్విటీ షేర్లజారీ తర్వాత కంపెనీలో కేంద్ర ప్రభుత్వం వాటా ప్రస్తుతం ఉన్న 22.60 శాతం నుంచి 48.99శాతానికి పెరుగనున్నది. ప్రమోటర్లు కంపెనీపై కార్యాచరణ నియంత్రణను కొనసాగిస్తారని ఫైలింగ్‌లో పేర్కొంది.

# మరో ఏడాదిన్నరలో రూ.1,00,000 దాటనున్న తులం బంగారం ధర..!



బంగారం ధరలు అంతకంతకే పెరిగిపోతున్నాయి. దాంతో సామన్యులకు బంగారం కొనుగోలు అనేది తలకు మించిన భారంగా మారిపోతున్నది. అంతర్జాతీయ మార్కెట్‌లో రానున్న ఏడాదిన్నర కాలంలో ఔన్స్ (28.3 గ్రాముల) బంగారం ధర 3500 డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నదని భోఫా గ్లోబల్ రిసెర్చ్ సంస్థ తన నివేదికలో పేర్కొన్నది. అంటే భారత కరెన్సీలో తులం (10 గ్రాముల) బంగారం ధర రూ.1 లక్ష దాటుతుందని భోఫా గ్లోబల్ రిసెర్చ్ స్పష్టం చేసింది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో నాన్ కమర్షియల్ కొనుగోళ్లు 10 శాతం పెరిగినప్పుడు మాత్రమే బంగారం ధర ఆ స్థాయికి చేరుతుందని తెలిపింది. 2025లో నాన్ కమర్షియల్ కొనుగోళ్లు 1 శాతం పెరిగితే అంతర్జాతయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం సగటు ధర 3000 డాలర్లకు చేరిందని బోఫా గ్లోబల్ రిసెర్చ్ తెలిపింది. బంగారం ధరలు పెరగడానికి వివిధ కారణాలను సదరు సంస్థ వెల్లడించింది. చైనాకు చెందిన ఓ ఇన్సూరెన్స్ కంపెనీ తన ఆస్తుల్లో ఒక శాతాన్ని బంగారంపై పెట్టుబడిగా పెట్టనుండటం కూడా బంగారం ధర పెంపునకు కారణమని తెలిపింది. ఆ కంపెనీ ఆస్తుల్లో ఒక శాతం అంటే ఒక ఏడాది గోల్డ్ మార్కెట్ విలువలో 6 శాతానికి సమానమని తెలిపింది. అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు తమ పోర్ట్‌ఫోలియోలను మరింత సమర్థంగా మార్చుకోవడం కోసం ప్రస్తుతం తమ దగ్గరున్న 10 శాతం బంగారం నిల్వలను 30 శాతానికి పెంచుకోబోతున్నాయి. అదేగనుక జరిగితే బంగారం ధరలకు అమాంతం రెక్కలు రానున్నాయని బోఫా గ్లోబల్ రిసెర్చ్ పేర్కొంది. స్టాక్ మార్కెట్ల ఒడిదొడుకుల నేపథ్యంలో రిటైల్ ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులు పెట్టేందుకు ఎక్కువగా మొగ్గుచూపుతుండటం కూడా ధరలు పెరగడానికి కారణమని తెలిపింది.

# ఆరోగ్య బీమా.. ఓ స్మార్ట్ పెట్టుబడి



నేడు వైద్య ఖర్చులు ఏ స్థాయిలో పెరిగిపోయాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి అంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం.. మీ కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఇక గతంతో పోల్చితే ప్రస్తుతం అందుబాటులో ఉంటున్న ఆరోగ్య బీమా పాలసీలు.. కేవలం దవాఖానల్లో చేరికలకేగాక, ఓపీడీ సంప్రదింపులు, టెలీ మెడిసిన్, ముందస్తు వైద్య పరీక్షలు, ప్రసూతి, మానసిక, రిహాబిలిటేషన్, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్నీ అందిస్తుండటం విశేషం. నిజానికి మారిన జీవనశైలితో ఇప్పుడు చాలామంది వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. గుండె-కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదాలబారిన కూడా పడుతున్నారు. దీంతో ఇలాంటివారికి ఆరోగ్య బీమా, ప్రధానంగా క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లుండే పాలసీల అవసరం చాలా ఉంటున్నది. ఇలాంటి కవరేజీలను ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సహా అనేక సంస్థలు ప్రభావవంతంగా అందిస్తున్నాయి. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు. 60 ఏండ్లలోపువారికి ఏటా రూ.25,000దాకా, ఆపై వయసున్న సీనియర్ సిటిజన్లకు రూ.50,000 వరకు పన్ను మినహాయింపులను పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ఈ ఉగాదితో మొదలైన కొత్త ఏడాదిలో ఆరోగ్య బీమా ఆవశ్యకతను గుర్తించి ఓ సానుకూల నిర్ణయం తీసుకోండి. ఒకవేళ ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్నైట్టైతే.. సమగ్ర కవరేజీలుండే, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే మరింత మెరుగైన బీమాను కొనడం ఉత్తమం.



# డబుల్ ధమాకా



ప్రేక్షకులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు హీరోయిన్ వైష్ణవీ చైతన్య. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'జాక్'లో ఆమె తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. తెలుగమ్మాయి అయిన వైష్ణవీ చైతన్య కెరీర్ ప్రారంభంలో 'లవ్ ఇన్ 143 అవర్స్', 'ది సాఫ్ట్‌వేర్ డెవలపర్', 'అరెరే మానస', 'మిస్సమ్మ' వంటి షార్ట్ ఫిల్మ్స్ చేశారు.ఆ తర్వాత 'అల వైకుంఠపురములో', 'వరుడు కావలెను' చిత్రాల్లో అతిథి పాత్రల్లో నటించిన ఆమె 'బేబీ'(2023) మూవీతో హీరోయిన్‌గా మారారు. సాయి రాజేశ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ సూపర్ హిట్‌గా నిలిచి, రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ మూవీతో ఆడియన్స్ లో బోలెడంత క్రేజ్ సొంతం చేసుకున్న వైష్ణవీ చైతన్య ఆ తర్వాత వరుస అవకాశాలతో దూసుకెళుతున్నారు. తాజాగా సిద్ధు జొన్నలగడ్డకి జోడీగా ఆమె నటిస్తున్న చిత్రం 'జాక్'. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ మూవీలో ఆమె ఫస్ట్ టైమ్ ద్విపాత్రాభినయం చేశారు. అదేవిధంగా '90 ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌కి సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమాలో ఆనంద్ దేవరకొండకి జోడీగా నటిస్తున్నారు వైష్ణవి. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

# ఆ స్టార్ హీరోయిన్‌తో ప్రభాస్ పెళ్లి.. నిజంగానే జరిగితే?



టాలీవుడ్‌లో రెబల్ స్టార్ పెళ్లి గురించి చర్చ ఇప్పటి నుంచి మొదలైంది కాదు. గత పదేళ్లుగా ఏదో ఒక సందర్భంలో ప్రభాస్ పెళ్లి ముచ్చట వినిపిస్తూనే ఉంటుంది. అలా మరోసారి ఇటీవలే ప్రభాస్ పెళ్లి లొల్లి మొదలైంది. ఓ ప్రముఖ వ్యాపారవేత్త కూతురిని ఆయన పెళ్లాడబోతున్నారని టాక్ వచ్చింది. కానీ ఈ విషయంపై ఆరా తీస్కే అదంతా ఒట్టి పుకారే తేలిపోయింది. ఈ విషయంపై ఆయన టీమ్ సైతం స్పష్టమైన సమాధానం ఇచ్చింది. అవన్నీ ఫేక్ వార్తలేనని కొట్టిపారేసింది.ఇక ప్రభాస్ అన్న పెళ్లి ముచ్చట వచ్చినప్పుడల్లా ఆ స్టార్ హీరోయిన్ పేరు కూడా వినిపిస్తుంది. ఎందుకంటే వీరిద్దరు జంటగా పలు సూపర్ హిట్ మూవీల్లో నటించారు. ఆమె మరెవరో కాదు.. టాలీవుడ్ అభిమానులు స్వీటీ అని పిలుచుకునే అనుష్క శెట్టి. వీరిద్దరూ పెళ్లి చేసుకుంటే చూడాలని ఎంతోమంది సినీ ప్రియులు ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ ఇదేది అంత ఈజీగా అయ్యే పనిలా మాత్రం కనిపించడం లేదు.అందుకే ఓ నెటిజన్ వినూత్న ఆలోచనతో ఓ వీడియోను రూపొందించాడు. అది చూస్తే ఈ జంట ఇంత చూడముచ్చటగా ఉన్నారా? అంటూ కామెంట్స్ చేయకుండా ఉండలేరు. అంతలా ఎడిట్ చేసిన ఓ నెటిజన్ ఆ వీడియోను ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. ఇంతకీ ఆ వీడియో ఏంటో చూసేద్దాం పదండి.నెటిజన్ ఎడిట్ చేసిన ఫోటోలతో ప్రభాస్- అనుష్క శెట్టికి పెళ్లైనట్లు ఊహించుకుని ఓ వీడియోను రూపొందించాడు. పెళ్లి మాత్రమే కాదు.. ఈ జంటకు పిల్లలు పుడితే ఎలా ఉంటారో కూడా ఊహించి మరీ ఫోటోలు ఎడిట్ చేసిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. అలా ఎడిట్ చేసిన ఫోటోలు చూస్తే ప్రభాస్- అనుష్క జోడీ టాలీవుడ్‌లో సూపర్ హిట్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇంకెందుకు ఆలస్యం ఆ ఫోటోలు మీరు కూడా చూసి ఊహల్లో విహరించండి.



## పూజా హెగ్డే అద్భుతమైన ఫ్యాషన్

పూజా హెగ్డే పరిశ్రమలోని అత్యంత స్టైలిష్ నటీమణులలో ఒకరు, ఆమె తన పాపము చేయని ఫ్యాషన్ ఎంపికలతో అందరినీ ఆకట్టుకుంటుంది పూజా హెగ్డే పరిశ్రమలోని అత్యంత స్టైలిష్ నటీమణులలో ఒకరు, ఆమె పాపము చేయని ఫ్యాషన్ ఎంపికలతో అందరినీ నిరంతరం ఆకట్టుకుంటుంది. ఆమెకు తాజా ట్రెండ్‌ల పట్ల ఆసక్తి ఉంది మరియు ప్రతి దుస్తులను చక్కదనం మరియు చక్కదనంతో ఎలా తీసుకెళ్లాలో ఆమెకు తెలుసు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించిన తమిళ రొమాంటిక్ యాక్షన్ చిత్రం రెట్రోలో పూజా రాబోయే పాత్ర కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. స్టోన్ బెంచ్ క్రియేషన్స్ మరియు 2 ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ చిత్రంలో సూర్య మరియు పూజ ప్రధాన పాత్రల్లో నటించారు, ఇది తెరపై ఉత్తేజకరమైన కొత్త జంటగా నిలుస్తుంది. ఇటీవల, పూజా హెగ్డే తన అద్భుతమైన ఆధునిక ఫోటోషూట్‌లతో అలలు సృష్టిస్తోంది, సమకాలీన శైలితో సొగసును అప్రయత్నంగా మిళితం చేస్తుంది. ఆమె ఫోటోలు సొగసైన గౌన్ల నుండి సాధారణ వీధి దుస్తుల వరకు విస్తృత శ్రేణి చిక్ మరియు ట్రెండీ దుస్తులను ప్రదర్శిస్తాయి, ప్రతి లుక్ ఆమె అసాధారణమైన ఫ్యాషన్ సెన్స్‌ను ప్రతిబింబిస్తుంది. మినిమలిస్ట్ స్టైల్స్‌లో పోజులిచ్చినా లేదా బోల్డ్, వైబ్రెంట్ కలర్స్‌లో పోజులిచ్చినా, పూజా ఫోటోలు అధునాతనత మరియు సౌలభ్యాన్ని సంపూర్ణంగా సమతుల్యం చేస్తాయి. ఆమె ప్రకాశవంతమైన చిరునవ్వు, దోషరహిత మేకప్ మరియు పర్ఫెక్ట్‌గా స్టైల్ చేసిన జుట్టు ప్రతి దుస్తులకు పూర్తి చేస్తాయి, ఆమెను నిజమైన ఫ్యాషన్ ఐకాన్‌గా పటిష్టం చేస్తాయి. ప్రతి ఫోటోషూట్‌తో, పూజా తన తాజా మరియు బహుముఖ శైలితో తన అభిమానులను మరియు ఫ్యాషన్ ఔత్సాహికులను ప్రేరేపిస్తూనే ఉంది.



అవార్డు గెలుచుకున్నందుకు కీర్తి సురేష్ సంబరం

## 'అఖండ 2' లో ఆ హీరోయిన్ లేదట!




నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం మాస్ చిత్రాల దర్శకుడు బోయపాటి శ్రీను డైరెక్షన్‌లో 'అఖండ 2 %-% తాండవం' మూవీలో నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే, ఈ సినిమాకు సంబంధించి రోజుకో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ విద్యా బాలన్ ఓ కీలక పాత్రలో నటించబోతుందని తెలుస్తోంది.అయితే, ఈ వార్తపై విద్యా బాలన్ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఈ సినిమాలో విద్యా బాలన్ నటించడం లేదని.. ఆమెకు 'అఖండ 2'తో ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ వచ్చేసింది. దీంతో విద్యా బాలన్ అఖండ 2లో నటిస్తుందనే వార్త కేవలం రూమర్ అని తేలిపోయింది.గతంలో బాలయ్య నటించిన ఎన్టీఆర్ బయోపిక్ మూవీలో విద్యా బాలన్ నటించిన సంగతి తెలిసిందే. వారిద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను మెప్పించడంతో, ఇప్పుడు అఖండ 2లో ఆమె నటిస్తుందనే వార్త చక్కర్లు కొట్టింది. ఇక అఖండ 2లో యంగ్ బ్యూటీ సంయుక్త మీనన్ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ను మే నెలాఖరు వరకు ముగించాలని చిత్ర యూనిట్ భావిస్తోందట.

## రష్మిక అక్కడ బుక్ అయ్యింది!



నేషనల్ క్రష్ రష్మిక ప్రస్తుతం ఎలాంటి ఫామ్‌లో ఉందో అందరికీ తెలిసిందే. వరుసగా పాన్ ఇండియా చిత్రాలు.. స్టార్ హీరోల సరసన ఆఫర్లతో ఈ బ్యూటీ ఏ హీరోయిన్ పోటీ పడలేనంతగా దూసుకుపోతుంది. పుష్ప-2 గ్రాండ్ సక్సెస్, ఛావా సెన్సేషన్.. ఇలా బ్యాక్ టు బ్యాక్ నేషనల్ స్థాయిలో తన సత్తా చాటుకుంది ఈ బ్యూటీ. అయితే, ఇప్పుడు మాత్రం రష్మికకు బ్యాడ్ టైమ్ ఎదురైందని చెప్పాలి.టాలీవుడ్‌లో తప్పించుకున్న రష్మిక బాలీవుడ్ దగ్గర బుక్ అయ్యింది. హీరో నితిన్ నటించిన 'రాబిన్‌హుడ్' మూవీ ఇటీవల రిలీజ్ అయ్యి యావరేజ్ రిజల్ట్‌ను రాబడుతోంది. ఇక ఈ సినిమాలో తొలుత రష్మిక హీరోయిన్‌గా ఓకే చెప్పింది. కానీ, కొన్ని కారణాల వల్ల ఆ ఛాన్స్ శ్రీలీలకు వెళ్లింది. ఈ సినిమాలో ఆమె పాత్రపై సోషల్ మీడియాలో చాలా నెగెటివిటీ వస్తుంది. దీంతో రష్మిక ఈ సినిమా చేయకపోవడం చాలా మంచిదయ్యిందని అందరూ అనుకున్నారు.కానీ, బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ సరసన 'సికందర్' సినిమాలో నటించిన రష్మిక, అక్కడ మాత్రం ఫ్లాప్‌ను మూటగట్టుకుంది. భారీ అంచనాలతో రిలీజ్ అయిన సికందర్ చిత్రానికి ప్రేక్షకుల నుంచి నెగెటివ్ రెస్పాన్స్ దక్కింది. దీంతో ఈ సినిమాలో నటించినందుకు రష్మిక బుక్ అయ్యిందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. ఏదేమైనా సౌత్‌లో ఫ్లాప్ తప్పించుకున్న ఈ బ్యూటీ, నార్త్‌లో తప్పించుకోలేకపోయింది.

# ఓటీటీలోకి 'ఛావా'.. 800 కోట్లు రాబట్టిన సెన్సేషనల్ మూవీ



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న 'పుష్ప2'తో బ్లాక్ బాస్టర్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత హిందీలో 'ఛావా' చిత్రంతో మరో బ్లాక్ బాస్టర్ హిట్ ను సొంతం చేసుకుంది. ఛత్రపతి శివాజీ మహరాజ్ కొడుకు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం 2025 ఫిబ్రవరి 14న కేవలం హిందీలోనే గ్రాండ్ గా విడుదలైంది. బాలీవుడ్ స్టార్ హీరో, కత్రినా కైఫ్ భర్త విక్కీ కౌషల్ ఈ చిత్రంలో శంభాజీ పాత్రను పోషించారు. రష్మిక మందన్న శంభాజీ భార్య యేసుబాయ్ బోన్లే పాత్రలో నటించి మెప్పించింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంతో విక్కీ కౌషల్ నట విశ్వరూపాన్ని చూపించారు. ఆయన కెరీర్ లో ఇది చెప్పుకోదగిన చిత్రంగా మిగిలిపోయింది. శంభాజీ పాత్రకు సరిగ్గా సరిపోవడమే కాకుండా.. యాక్షన్ సీన్లలోనూ దుమ్ములేపాడు విక్కీ కౌషల్. మరోవైపు రష్మిక మందన్న కూడా తన పాత్రకు ప్రాణం పోసింది. ఇలా ఇద్దరూ కలిసి మొఘల్ కాలాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. అయితే ఈ చిత్రానికి నార్త్ లోని ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. అంతే కాదు బాలీవుడ్ ఇండస్ట్రీలోనే ఈ చిత్రం 13వ హ్యాయేస్ట్ గ్రాసింగ్ ఇండియన్ ఫిల్మ్ గా రికార్డు క్రియేట్ చేసింది. మరోవైపు హ్యాయేస్ట్ గ్రాస్ వసూల్ చేసిన 8వ హిందీ చిత్రంగానూ రికార్డు నెలకొల్పింది.దెబ్బకొట్టిన సికందర్.. దారుణంగా ఛావా వసూళ్లు, విక్కీ కౌశల్ మూవీకి ఎన్ని కోట్లంటే?" ఇలా ఛావా చిత్రానికి చాలానే విశేషాలు దక్కాయి. నార్త్ లో ఊహించిన దానికంటే అత్యధికంగా వసూళ్లు, రెస్పాన్స్ రావడం, పైగా ఛత్రపతి శివాజీ కొడుకు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర కావడంతో తెలుగు రాష్ట్రాల్లోనూ మార్చి 7న గ్రాండ్ విడుదల చేశారు. ఇక్కడా దుమ్ములేపిందీ చిత్రం. అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీలో కూడా విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రం డిజిటల్ రైట్స్ ను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. కాగా తాజాగా ఓటీటీ రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. ఏప్రిల్ 11 నుంచి ఆడియెన్స్ కు అందుబాటులోకి రానుంది. ఈ చిత్రాన్ని యష్ రాజ్ ఫిల్మ్స్ పంపిణీ చేసింది. తెలుగు వెర్షన్ హక్కులను గీతా ఆర్ట్స్ ఏపీ, తెలంగాణలో పంపిణీ చేసింది. తెలుగు వెర్షన్ బ్రహ్మండమైన విజయాన్ని సాధించడంతో ఇక ఓటీటీలోనూ ఈ సినిమా ఏ రేంజ్ లో వ్యూయర్ షిప్ ను అందుకుంటుందో వేచి చూడాలి. ఇక ఛావా చిత్రం తెలుగులో ఇప్పటికీ వసూళ్లను అందుకుంటూనే ఉంది. ఇప్పటి వరకు ఏపీ, తెలంగాణలో కలిసి రూ.16 కోట్ల గ్రాస్ వసూల్ చేసింది. ఇక రూ.140 కోట్ల బడ్జెట్ తో రూపొందించిన ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు అందాయి. వరల్డ్ వైడ్ గా 45 రోజులుగా వసూళ్లు అందుకుంటూనే ఉందీ చిత్రం. ఇప్పటి వరకు రూ.790 కోట్ల వరకు గ్రాస్ వసూల్ చేసి ఆశ్చర్యపరిచింది. ఈ హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ కు ఆస్కార్ విన్నర్ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

## మరో స్పెషల్ సాంగ్‌లో తమన్నా



మిల్కీ బ్యూటీ తమన్నా ప్రస్తుతం 'ఓదెల 2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఆమె పాల్గొంటూ సందడి చేస్తుంది. ఇక ఈ సినిమాతో బాక్సాఫీస్ దగ్గర మరోసారి మంచి విజయాన్ని అందుకోవాలని ఆమె అభిమానులు కోరుతున్నారు. ఇక ఈ బ్యూటీ బాలీవుడ్‌లోనూ తన క్రేజ్‌ను చూపిస్తోంది.ఇప్పటికే బాలీవుడ్ ప్రేక్షకులను పలు చిత్రాల ద్వారా ఆకట్టుకున్న తమన్నా, అక్కడ స్పెషల్ సాంగ్స్‌తోనూ ఇంప్రెస్ చేస్తుంది. 'స్త్రీ-2' చిత్రంలో తమన్నా 'ఆజ్ కి రాత్' స్పెషల్ సాంగ్ ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. కాగా, ఇప్పుడు మరో సినిమాలో స్పెషల్ సాంగ్ చేసేందుకు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అజయ్ దేవ్గన్ హీరోగా నటిస్తున్న 'రైడ్-2'లో ఓ స్పెషల్ సాంగ్‌లో తమన్నా డ్యాన్స్ చేయనుంది. ఈ పాటలో హనీ సింగ్ కూడా ఉంటారని తెలుస్తోంది.ఇక ఈ పాటను ప్రమోషనల్ సాంగ్‌గా తెరకెక్కించనున్నారు. ఈ సినిమాకు ఈ పాట మరింత బూస్ట్ ఇస్తుందని చిత్ర యూనిట్ భావిస్తోందట. ఈ సినిమాను వేసవి కానుకగా మే 1న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332